Rs. 12/- per copy

UESI
ANDHRA PRADESH

# విద్యార్థి జ్వాల

Vol. 29 - No.4

February 2023



4లో

గురువు-శిష్యుడు

# క్రీస్తు కేంద్రిత జీవితం

**శిష్యత్వ సందేశం**

విశ్వాసులు "క్రీస్తు కేంద్రిత జీవితం" అనే మాటల్ని తరచుగా వాడతారు. అయితే ఈ విషయం గురించి మాట్లాడడం సులువే కానీ జీవించడం చాలా కష్టమే. ఎందుకంటే, వ్యక్తుల అనుదిన జీవితంలో కేంద్ర స్థానం కోసం క్రీస్తుతో పాటు అనేక విషయాలు పోటీకి వస్తాయి. కాబట్టి క్రీస్తు కేంద్రిత జీవితం గురించి మరింతగా అర్థం చేసుకోవడానికి ఉపయోగపడే నాలుగు విషయాలను పరిశీలిద్దాం.

**1. మూలం:** మన ఉనికికి, మనకు కలిగిన సమస్తానికి మూలం లేదా ఆధారం ప్రభువే అనే విషయం గ్రహించినప్పుడు మాత్రమే మనం క్రీస్తు కేంద్రిత జీవితం జీవించడం ఆరంభమవుతుంది. వాక్యానుసారమైన మంచి జీవితం జీవించాలనే సహజమైన కోరిక, నైతిక సామర్థ్యం మనలో లేదు. అయితే దేవునికి ఇష్టమైన జీవితం జీవించడానికి అవసరమైనదంతా క్రీస్తులో మనం కలిగి ఉన్నాం (2 పేతురు 1:3).

**2. ప్రేరణ:** మన ఆలోచనలకు, మాటలకు, ప్రవర్తనకు, చేసే ప్రతి పనికి ప్రేరణగా క్రీస్తు ఉన్నప్పుడు మాత్రమే అది క్రీస్తు కేంద్రిత జీవితం అవుతుంది. చాలామంది క్రైస్తవులు భక్తి జీవితంలో స్వనీతి, సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, సంఘ నియమాలకు ఇచ్చినంత ప్రాధాన్యత క్రీస్తుకు ఇవ్వరు. అనుదిన జీవితంలో క్రీస్తు ద్వారా ప్రేరణ పొంది ఆయనతో అత్యంత సన్నిహితంగా ఉండేదే క్రీస్తు కేంద్రిత జీవితం.

**3. లక్ష్యం:** మన అనుదిన జీవితం ద్వారా యేసు మహిమ పొందాలనే ఏకైక గురి, లక్ష్యం కలిగి ఉండడమే క్రీస్తు కేంద్రిత జీవితం. మనం వ్యక్తిగతంగా సొంత ఇష్టాలు, లక్ష్యాలు కలిగి ఉండడం తప్పు కాదు. అయితే వాటన్నింటిని నడిపించే దిక్సూచిగా యేసు మహిమ పొందడం, ఆయనకు ఘనత రావడం ఉండాలి. మనం నిజంగా క్రీస్తు కేంద్రిత జీవితం జీవించాలని ఆశిస్తే మన నిర్ణయాలు స్వార్థపూరితంగా ఉండవు. ఆయన ప్రేమ ద్వారా పొందిన కొత్త ఆశలు, ఆకాంక్షల ఆధారంగా నిర్ణయాలు తీసుకొంటాం (2 కొరింథీ 5:14-15).

**4. నిరీక్షణ:** క్రీస్తు కేంద్రిత జీవితంలో మనకు కలిగినదంతా ఆయన చేతిలో పెడతాం. మన జీవితం ఈ లోకంతోనే ముగిసిపోదని, ఈ లోకం తరువాత కూడా భవిష్యత్ ఉందని, నిత్యత్వంలో జీవిస్తామని మనకు తెలుసు. క్రీస్తు కేంద్రిత జీవితం అంటే కేవలం నరకం తప్పించుకోవడం మాత్రమే కాదు. క్రీస్తులో మన ప్రస్తుత, భవిష్యత్ జీవితానికి ఓ నిరీక్షణ ఉంది. ఆయన తన సన్నిధి, కృప నిరంతరం మనతో ఉంటాయని వాగ్దానం చేశాడు. ఇలాంటి గ్రహింపుతో, నిరీక్షణతో జీవిస్తాం.

నేను క్రీస్తు కేంద్రిత జీవితం జీవిస్తున్నానా? నా జీవితానికి క్రీస్తే ఆధారంగా ఉన్నాడా? నేను చేసే ప్రతి పనికి ప్రేరణ ఆయనేనా? నా ప్రస్తుత జీవితానికి, నిత్యత్వానికి ఆయన యందు నిరీక్షణ కలిగి ఉన్నానా? అని వ్యక్తిగత పరిశీలన చేసుకోవాలి. "మన జీవితంలో మనం రక్షకునికి కేంద్ర స్థానం ఇచ్చే కొలది ఆయన మనతో ఓపిగ్గా నడుస్తాడు మరియు మన పోరాటాలలో తోడుగా ఉంటాడు" అని అంటాడు పాల్ ట్రిప్.

"అలాగే నీ హృదయ కేంద్రంలో క్రీస్తు ఉంటే పరిస్థితులను తట్టుకొనే సామర్థ్యం నీకు వస్తుంది. అప్పుడు నీవు ఒత్తిడి, సమస్యలు, దు:ఖం, సంక్షోభాల నుండి త్వరగా బయట పడగలవు. ఎన్నడూ మారని బలమైన దేవుడు నీ జీవితంలో ఉన్నాడు కాబట్టి నీవు చింతపడాల్సిన అవసరం లేదు" అని అంటాడు రిక్ వారెన్.

క్రీస్తును తమ జీవితంలో కేంద్ర స్థానంలో ఉంచి, ఆయనను వెంబడించే వారు కొంతకాలానికి ఆయనవలే మారతారు. ఎవరు ఆయన గురించి ఎక్కువగా మాట్లాడతారో, ఆలోచిస్తారో, కలలు కంటారో, ఎక్కువ సమయం ఆయన సన్నిధిలో గడుపుతారో వారు క్రీస్తు కేంద్రిత జీవితం కలిగినవారు. ఆయనను సంతోష పరచాలని, వారు ఆయన సారూప్యంలోకి మారాలనే బలమైన ఆకాంక్ష కలిగి ఉంటారు. దేవునిని మహిమపరచడమే క్రీస్తు కేంద్రిత జీవితం యొక్క ప్రధాన ఉద్దేశం.

మత కేంద్రిత జీవితం కలిగినవారు ఆధిక్యత కోసం, అగ్ర పీఠాల కోసం, గుర్తింపు కోసం, తమ సామర్థ్యాలు, నైపుణ్యాల ద్వారా వచ్చే మహిమ కోసం ప్రాకులాడతారు. వారు తాము సొంతగా ఏర్పరచుకొన్న నియమాలను ప్రామాణికాలుగా మారుస్తారు. తమసొంత ప్రామాణికాల ఆధారంగా ఇతరులకు తీర్పు తీరుస్తూ, తమ్మును తాము హెచ్చించుకొంటూ ఉంటారు. క్రీస్తు కేంద్రిత జీవితం కలిగినవారు యేసుక్రీస్తు తమ కోసం చేసిన కార్యాల మీద ఆధారపడతారు. దేవునికి దగ్గరయ్యేందుకు పరిశుద్ధ జీవితం కలిగి ఉండాలని కోరుకొంటారు (హెబ్రీ 12:14).

యేసు క్రీస్తు తప్ప మరెవ్వరూ సంపూర్ణమైన మంచి జీవితం జీవించలేదు (హెబ్రీ 4:15). నిజానికి క్రీస్తు కేంద్రిత జీవితం జీవించాలనే బలమైన కోరిక కలిగినవారు కూడా కొన్ని బలహీన క్షణాల్లో తొట్రుపడ్డారు, పడిపోయారు, పాపం చేశారు, శరీరానుసారమైన నిర్ణయాలు తీసుకొన్నారు (1 యోహాను 1:8-10). అయితే వారు అట్టి వాటిలో కొనసాగకుండా వెంటనే పశ్చాత్తాపపడ్డారు, తిరిగి త్వరగా దేవుని సహవాసంలోకి వచ్చారు. ఇలా నిరంతరం దేవునితో సమన్వయం చేసుకొంటూ జీవించే జీవితమే క్రీస్తు కేంద్రిత జీవితం. అయితే ఇది జీవిత కాలం జరిగే ప్రక్రియ. ఈ ప్రక్రియలో దేవుడు వారిని యేసు స్వరూపంలోకి మారుస్తాడు (రోమా 8:29; హెబ్రీ 12:14). మనం మొదట మన హృదయంలో ఆయనకు ప్రథమ స్థానం ఇస్తే, ఆ తరువాత మన జీవితాలు ఆయనను వెంబడిస్తూ ఉంటాయి.

– విజె డెస్క్

# విద్యార్థి జ్వాల

Vol. 29, No.4 February 2023
A Publication of
UESI Publication Trust



## క్రీస్తులో నిలిచి ఉందాం..

"నాలో నిలిచి ఉండకపోతే నీవేమీ చేయలేవు" (యోహాను 15:4-6). ఈ మాట యొక్క లోతైన భావం, దానిలోని సత్యం బలమైన ఆత్మీయతకు మూలం. నాకు నేనుగా దైవికమైన జీవం ఇవ్వగలనా? లేదు. కొనసాగించడం గాని, దానిని పెంచడం గాని సాధ్యమౌతుందా? సాధ్యమవ్వదు. ప్రతి కదలిక క్రీస్తు వలన పరిశుద్ధాత్మ ద్వారా జరిగే కార్యం. ఇది నమ్మితే విశ్వాసి సంపూర్ణంగా దేవునిపై ఆధారపడతాడు. ఇదే విశ్వాస జీవితం యొక్క సారాంశం. నీవు ఏమీ చేయలేవు అనే మాటకు హృదయపూర్వకంగా ఆమేన్ అంటాడు. అటు తర్వాత నన్ను బలపరచువానియందే సమస్తము చేయగలనని చెప్తాడు.

– ఆండ్రూ ముర్రే

## లోపలి పేజీల్లో...


- క్రీస్తు కేంద్రిత జీవితం- 2
- గురువు -శిష్యుడు - 4
- సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ - 8
- ఏడు వ్యూహాలు - 9
- క్రమశిక్షణతో కూడిన శిష్యరికం - 12
- హైకూలు - 15
- ఉపేక్షించుకోవడం - 16
- ఒప్పందం - 18
- దైనందిన జీవితానికి దిక్సూచి - 19
- పరుగుపందెం కన్నా ప్రభువు సన్నిధే మిన్న - 23
- ప్రేమ - 26
- వెలుగిచ్చే దీపాలు - 28
- కోశాధికారి లేఖ - 31
- శిష్యులమే కానీ - 32


EDITORIAL BOARD:

Mr. B.J. Lazarus, Honorary Editor
Mr. P. Sunil Jacob - Editor
Dr. J. Ratna Grace - Member
Dr. M. Solomon Raju - Member
Mrs. K. Martha - Member
Mr. B. Jason - Member
Mr. G. Leela Narayana - Member
Dr. J. Subbarao - Sec., Litt.Dept.

CONTACT:

The Editor, Vidyarthi Jwala,
UESI-AP - Study Centre, # 19-37,
Abhishek Nagar, Nambur - 522 508
Ph: 0863-2293319, 9299997087
Email: editorvj@gmail.com

GIFTS & SUBSCRIPTIONS:

Can be made by Cheque/DD/MO
in favour of UESI-AP,
Abhishek Nagar, Nambur - 522 508
ANNUAL: GRADUATES - Rs.250
STUDENTS - Rs. 120
LIFE INLAND - Rs. 2000
LIFE OVERSEAS - US $ 150

VIDYARTHI JWALA ACCOUNT NO:

**SBI - 36698741798**
**IFS Code: SBIN0011994**
**uesiap vj, Nambur Branch**

GENERAL CONTRIBUTIONS ACCOUNT NO:

**SBI - 10949477628**
**IFS Code: SBIN0000844**
**Commercial Branch, Guntur**

LITERATURE ACCOUNT NO:

**SBI - 36698741437**
**IFS Code: SBIN0011994**
**uesiap pt, Nambur Branch**

**Please inform/ SMS to**
**Mr. A. Venu, Accountant (9849516060)**
**Email: <uesiapacc84@gmail.com>**

TOPICS:

March: Improving member care
April: Expansion of the Ministry
May: Mission Partnership
June: Building Christlike leadership

**Note:** Please send your writeups on or before
**10th of every month**

కవర్ కథనం

# గురువు-శిష్యుడు

## పరిచయం

మనిషి జన్మించిన నాటినుండి అతనికి సంబంధాలు అవసరం. అవి లేకపోతే అతని మనుగడ సాధ్యం కాదు. సంబంధాలు కుటుంబంలో ప్రారంభమవుతాయి. తర్వాత సంఘంలో, పాఠశాలలో, కార్యాలయంలో, సమాజంలో అవి కొనసాగుతాయి. కుటుంబంలోని సంబంధాల తర్వాత అత్యంత కీలకమైన సంబంధాలలో ఒకటి గురువు, శిష్యుని మధ్య ఉండే సంబంధం. భారతీయులమైన మనందరికి గురువు, శిష్యుడు అనే పదాలు బాగా పరిచయమే. ఈ సంబంధాన్ని చాలా గొప్పదిగా గుర్తించడం, దానిని అనేక శతాబ్దాలుగా కొనసాగించడం జరుగుచున్నది. అది చాలా పవిత్రమైన బంధంగా పరిగణించబడుచున్నది. ఈ సంబంధానికి సంబంధించి అనేక అద్భుతమైన కథలు మనకు ఉన్నాయి. ఈ సంబంధానికి పూర్వకాలంలో ఉన్నంత గౌరవం ఇప్పుడు లేకపోయినా, దీనికి ఈ రోజుల్లో కూడా గౌరవం ఎంతో కొంత ఉంది. దాదాపు అన్ని మతాల్లోను గురువు-శిష్యుడు అనే విషయం ఉన్నది. అయితే, సాంకేతిక పరిజ్ఞానం, మీడియా ఈ సంబంధానికి సరికొత్త అర్థాలను, అనుకరణను జోడించాయి. దీని అర్థం, పరిధి ఎంతో పెరిగిపోయింది. వ్యక్తిగత సంబంధాల స్థాయి నుండి వ్యక్తితో నేరుగా ఎలాంటి సంబంధంలేని స్థితికి ఇది మారిపోయింది. ఇప్పుడు గూగుల్ (ఇంటర్నెట్ సెర్చ్ ఇంజన్) ప్రపంచంలోనే అతి పెద్ద గురువుగా అవతరించింది. ఈ గురువుకి ప్రపంచవ్యాప్తంగా లక్షలమంది శిష్యులు ఉన్నారు. ఏ అంశమైనాసరే ఈ గురువు బోధిస్తాడు. ఈ గురువుకు ఉద్యోగ విరమణ లేదు, జీతం తీసుకోడు, అలాగే 24/7 అందుబాటులో ఉంటాడు. ఇక్కడ విద్యార్థికి వయోపరిమితి లేదు. దీని అంతిమ ఫలితం ఏంటంటే, బోధించడానికి ఒక గురువు



అందుబాటులో ఉంటాడు. నేర్చుకోవడానికి ఒక శిష్యుడు కూడా ఎప్పుడూ సిద్ధంగానే ఉంటాడు. ఇక్కడ శిష్యునికి ఉండే విచక్షణవల్ల మేలుగానీ, కీడుగానీ జరుగుతుంది.

గురు–శిష్యుల సంబంధంలో బైబిల్ క్రీస్తు ప్రభువు అత్యంత గొప్ప గురువు అని తెలియజేస్తుంది. ఆయనకు కొద్దిమంది శిష్యులు ఉన్నారు. ఆయన వారిని తర్ఫీదు చేశాడు. ప్రభువైన యేసుక్రీస్తు ఈ భూమిమీద జీవించినప్పుడు ఆయనను ఇష్ట పడేవారు, ద్వేషించేవారు అందరూ ఆయనను 'బోధకుడా' అని పిలిచారు. ప్రతీసారి ఆయనను 'బోధకుడా' అని సంబోధించారు, 'ప్రసంగీకుడా' అని కాదు. తాను బోధకుడినని యేసుక్రీస్తు తనను గూర్చి తాను రెండు సార్లు చెప్పుకున్నాడు (మత్తయి26:18; యోహాను13:13–14). ప్రేషిత ఆజ్ఞలో కూడా, మనం వెళ్ళి ప్రకటించే పని మాత్రమే కాదు, బోధించి ఆయనకు శిష్యులుగా చేయమని ఉన్నది (మత్తయి 28:18–20). కాబట్టి, గురుశిష్యుల అంశాన్ని ప్రేషితసేవ ఆజ్ఞలో కూడా మనం చూడగలం.

## అర్థాలు

గురువు అనే పదానికి సాధారణమైన అర్థం, తన జ్ఞానాన్ని ఒక క్రమమైన పద్ధతిలో ఇతరులకు అందించి, నేర్పించేవాడే గురువు లేక బోధకుడు.

బోధకుడు లేదా గురువు నేర్పించే విషయాలను, అందించే జ్ఞానాన్ని నేర్చుకొనేవాడే శిష్యుడు.

గురుశిష్యుల మధ్య ఏర్పడిన నమ్మకమే ఈ సంబంధ విజయానికి కారణం అవుతుంది. గురువు తన జ్ఞానాన్ని నమ్మకంగా తన శిష్యునికి అందించాలి. శిష్యుడు తన గురువు నుండి నేర్చుకొనే విషయంలో నమ్మకంగా ఉండాలి. ఇది పరస్పర నమ్మకం, పరస్పరం ఇచ్చిపుచ్చుకోవడం. అయితే ఈ గురు శిష్యుల సంబంధాన్ని గూర్చి బైబిల్ ఏమిచెబుతుంది?

## గురువు (బోధకుడు)

బోధకుడు అనే మాటను గ్రీకులో 'డిడాస్కాలోస్' అని అంటారు. ఈ గ్రీకు పదాన్ని హిబ్రూలో 'రబ్బీ' అని అనువదించారు లేదా బోధించే అంశం ద్వారా వింటున్న ఒక వ్యక్తి చిత్తాన్ని గురువు ప్రభావితం చేస్తాడు. దానిని ఒక మంచి స్థితిలోకి మారుస్తాడు. పాతనిబంధనను బోధించే అధికారంగల వారిని, దైవిక సత్యాలను బోధించేవారిని డిడాస్కోలో అని

**కొంతమంది ఉచ్ఛరణమీద ఎంతగా దృష్టిపెడతారంటే, అవి వినేవారిమీద ఏ విధమైన ప్రభావం చూపించవు. అయితే, యేసుక్రీస్తు బోధలు మనస్సాక్షిని మేల్కొలిపాయి, మనసును వెలిగించాయి, హృదయాన్ని రగిలించాయి. యావత్ మానవజాతి శారీరిక, సామాజిక, ఆధ్యాత్మిక తృష్ణలను తృప్తిపరచాయి.**

యేసుక్రీస్తు జీవించినకాలంలో పిలిచేవారు. ఈ పదం కొత్తనిబంధనలో 58సార్లు ఉపయోగించగా, అందులో 41 సందర్భాల్లో యేసుక్రీస్తును ఉద్దేశించి ఈ పదం వాడడం జరిగింది. బోధకుడా అని యేసుక్రీస్తును ఆయన శిష్యులు (మార్కు 4:38), పరిసయ్యులు (మత్తయి 8:19;12:38), పరిసయ్యులు, హేరోదియులు (మత్తయి 22:16), సద్దూకయ్యులు (మార్కు 12:19), ఒక ధర్మశాస్త్ర బోధకుడు (మార్కు 12:32), మోసకారియైన ఒక యూదుడు (లూకా 20:21), ధనవంతుడైన ఒక యౌవనస్తుడు (లూకా 18:18), సుంకరులు (లూకా 3:12), తన శిష్యురాలైన మార్త (యోహాను 11:28) పిలిచారు. యేసుక్రీస్తు ఖచ్చితంగా ఒక బోధకుడే. కేవలం ఒక తరగతికి పరిమితమైన బోధకుడు కాదు ఈయన. ఆయన ప్రతిచోటా బోధించాడు. అంతేకాదు ప్రతి వ్యక్తి మనోగతాలను తెలిసిన పరమ గురువు.

## శిష్యుడు

శిష్యుడు అనే మాటకు గ్రీకులో ఉపయోగించిన పదం 'మథెటెస్', ఈ పదం 'మంథనో' అనే గ్రీకుపదం నుండి వచ్చింది. దీనర్థం 'నేర్చుకోవడం', 'మాత్' అనే పదం దీనికి మూలం. 'మాత్' అంటే 'ఆసక్తితో ప్రయత్నించి, శ్రమించి సాధించడం' అని అర్థం. (ఈ పదం నుండే మేథమెటిక్స్ అనే ఇంగ్లీష్ పదం వచ్చింది). నియతవిధానం (ఫార్మల్)లోగానీ, అనియత విధానంలో (ఇన్‌ఫార్మల్) గానీ ఒక వ్యక్తి బోధన నుండి నేర్చుకోవడం అనేది ఈ పదం యొక్క అర్థం. పరిశీలన, విచారణ ద్వారా ఆసక్తితో నేర్చుకోవడం అనే అంశం శిష్యత్వంలో ఇమిడి ఉంది. కాబట్టి, 'మతెటీ' అంటే అర్థం ఒక విద్యార్థి అని మాత్రమే కాదు, అంతకన్నా ఎక్కువ. ఒక బోధకుడిని



అనుకరించే వాడని కూడా ఈ పదం అర్థం ఇస్తుంది. 'మతెటీ' అనేది ఆధ్యాత్మికతకు సంబంధించిన పదం కాదు. యేసుక్రీస్తును నిజంగా వెంబడించిన శిష్యులకు, పైపై భక్తితో ఆయనను వెంబడించిన శిష్యులకూ ఈ పదాన్ని వాడడం జరిగింది.

సిద్ధాంతపరమైన, అభ్యసనాత్మకమైన జ్ఞానాన్ని ఒక వ్యక్తినుండి సంపాదించుకోడానికి తనను తాను బద్ధునిగా చేసుకొన్న వ్యక్తిని 'మథెటీ' (శిష్యుడు) అని అంటారు. అతను ఒక వ్యాపారసబంధమైన విషయాలలో శిక్షణ తీసుకొనే వ్యక్తియైనా అయి ఉండవచ్చు, వైద్యశాస్త్రాన్ని అభ్యసించే ఒక విద్యార్థి అయినా అయి ఉండవచ్చు, లేదా ఒక తాత్విక పాఠశాలలో సభ్యుడైనా అయి ఉండవచ్చు. డిడాస్కాలో ఆధ్వర్యం, శిక్షణలో మాత్రమే ఒక వ్యక్తి 'మెథెటీ'గా మారగలడు. సాధారణంగా ఒక శిష్యుడు తన గురువుకు ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

గ్రీకు సంస్కృతి ప్రభావం ఆనాటి కాలంలో ఎంతశక్తివంతంగా ఉందంటే, రోమీయులు గ్రీకులను ఓడించిన తర్వాత కూడా ఆనాటి ప్రజల సంస్కృతిపై ఉన్న గ్రీకు ప్రభావాన్ని తీసివేయ లేకపోయారు. కాబట్టి, బలవంతంగా ప్రజలను పనులు చేయించే బాహ్యపరమైన అధికారం కన్నా, ప్రజల ఆలోచనా విధానానికే అధిక ప్రాధాన్యత ఉండేది. శిష్యులుగా చేయమని ప్రభువు ఆ ఆజ్ఞ ఎందుకిచ్చారో అర్థం చేసుకోడానికి ఈ నేపథ్యం మనకు సహాయపడుతుంది. ఇవి సరిగా జరిగితే ఒక శిష్యుడు జీవితాంతం వెంబడిస్తాడు. ఎందుకంటే, ఆత్మలకోసం జరిగే యుద్ధం మొదట మనసులో జరుగుతుంది. సులభంగా చెప్పాలంటే, శిష్యుడనే వ్యక్తి నేర్చుకొనేవాడు మాత్రమే కాదు, వెబండించేవాడు కూడా. అందుకే యేసుక్రీస్తు తరచూ ఇలా చెప్పేవాడు 'నన్ను వెంబడించు' (మత్తయి 4:19;మార్కు 1:17; యోహాను 1:43). బాప్తీస్మమిచ్చు యోహానుకు అనుచరులు లేక శిష్యులు ఉన్నది అందుకే. పరిసయ్యులకు కూడా శిష్యులు ఉండేవారు (మార్కు 2:18).

## గురు శిష్యుల మధ్య ఉన్న సంబంధాలకు సంబంధించిన షరతులు

ఒక విశ్వాసి ప్రభువుతో ఉన్న శిష్యరికపు సంబంధాన్ని కొనసాగించకుండా ఒక విశ్వాసిగా మాత్రమే మిగిలిపోయే అవకాశం ఉంది. అయితే, శిష్యుడు తన శిష్యత్వ క్రమంలో ఆయనతో సంబంధాన్ని కొనసాగించాల్సి ఉంటుంది.

**అంగీకారం**: గురుశిష్యుల మధ్య బంధం పరస్పర అంగీకారంతో మొదలవుతుంది. యేసుక్రీస్తు తన శిష్యులకు తర్ఫీదు ఇవ్వడం ప్రారంభించకముందు, ఆయన వారిని మొదట అంగీకరించాడు, వారిని పిలిచాడు. ఆయనను వెంబడించడానికి వారు కూడా అంగీకరించారు. ప్రతి శిష్యుడు కూడా ఒక విశిష్టమైన వ్యక్తి, అనేక విషయాల్లో విభిన్నమైన వ్యక్తి. ఒక మంచి బోధకుడు తన శిష్యుని ఖచ్చితంగా అంగీకరించాలి.

**ఆత్మీయబంధం**: ఒక వ్యక్తిని తన శిష్యునిగా అంగీకరించినంత మాత్రాన సరిపోదు. హాజరు పట్టీల్లో ఒకవ్యక్తి పేరు రాసుకోవడం మాత్రమే కాదు గానీ అతనితో ఒక అనుబంధాన్ని ఏర్పరచుకోవాలి. అనుమానం, పక్షపాతం, అశ్రద్ధలను ఇది తొలగించి, ఆ వ్యక్తిపై వ్యక్తిగత శ్రద్ధ, పర్యవేక్షణను కలిగి ఉండేటట్లు చేస్తుంది. యేసుక్రీస్తు తన శిష్యులతో గడిపిన మూడున్నర సంవత్సరాల కాలంలో వారితో గొప్ప అనుబంధాన్ని కలిగి ఉన్నాడు. అనేకమంది శిష్యులుగా ఆయనను వెంబడించారు, అనేకమంది ఆయనను విడిచిపెట్టారు (యోహాను 6:66). కానీ పన్నెండుమంది ఒక ప్రత్యేకమైన సమూహం. వారితో ఆయన అన్యోన్యతను కలిగి ఉన్నాడు. వారికి వ్యక్తిగతంగా తనయందు నిలిచిఉండమని ఆయన బోధించాడు.

**నిబద్ధత**: గురుశిష్యుల మధ్య నిబద్ధత లేకపోతే ముందు చెప్పిన రెండు విషయాలు నిరుపయోగమవుతాయి. ఒకరినొకరు నమ్మలేరు, ఆధారపడలేరు. ఈ నిబద్ధతను ఇద్దరూ చూపించాలి. కష్టసమయాలను

ఇద్దరూ ఎదుర్కొనే అవకాశం ఉంది. తుఫానులు చెలరేగే అవకాశం ఉంది. అలాంటి సమయాలలో నిబద్ధత వారిని ఒకటిగా ఉంచుతుంది. తమ గురువు అరెస్టయినప్పుడు, శిష్యులు ఆయనను విడిచి పారిపోయారు. అయితే, పునరుత్థానుడైన తర్వాత ఆ గురువు వారి వద్దకు వెళ్ళాడు. ఆయన వారిని విడిచిపెట్టలేదు. వారి దగ్గరకు వెళ్ళి వారిని ధైర్య పరచాడు, ప్రోత్సాహపరచాడు, పని అప్పగి ంచాడు. మనము కూడా వెనుకంజవేసేవారిని అలా చేయడానికి చొరవ చూపాలి.

**అభివృద్ధి**: పై మూడు విషయాల అంతిమ లక్ష్యం శిష్యులు తమ గురువులా మారిపోవడం. "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారం మీరు నన్ను పోలి నడుచుకొనుడి" (1కొరింథీ 11:1) అని పౌలు తెలియజేశాడు. "నేను మీకు గురువును అయినప్పటికీ మన అందరికీ ప్రభువైన యేసుక్రీస్తు గురువు" అని పౌలు తెలియజేస్తున్నాడు.

**శక్తిమంతులుగా చేయడం**: తన శిష్యులకు యేసుక్రీస్తు ప్రభువు ఎన్నో విషయాలు బోధించాడు. నాకంటే గొప్ప కార్యాలు చేస్తారని, గురువుని మించిన శిష్యులుకాగలరని ప్రబోధించాడు. ఆయన పరలోకానికి ఆరోహణమవ్వక మునుపు ఒక గొప్ప ప్రేషిత ఆజ్ఞను ఆయన వారికి ఇచ్చాడు. తర్వాత, పెంతెకొస్తు రోజున శిష్యులు పరిశుద్ధాత్మ దేవుని శక్తిని పొందుకున్నారు. ఆ రోజున ఏంజరిగిందో మనందరి కీ తెలుసు. వెళ్ళి, సువార్తను ప్రకటించమనే ఆజ్ఞను ప్రభువు వారికి ఇచ్చాడు.

## గురువును వెంబడించడం ఎలా? ఆయన నుండి ఏమి నేర్చుకోవాలి?

శిష్యునిగా ఉండడానికి, అభిమానిగా ఉండడానికి చాలా తేడా ఉంది. జనసమూహాలు ఆయనను వెంబడించారు. వారందరూ ఆయన శిష్యులు కాదు. నిజానికి వారంతా అభిమానులు. క్లిష్టమైన సమయం వచ్చేసరికి వారంతా తమ గురువును విడిచివెళ్ళారు. 'అభిమాన సంఘాలు' అనే పదం మనకు తెలిసిందే. ఈ రోజుల్లో కూడా క్రీస్తు ప్రభువుకు అనేకమంది అభి మానులు ఉన్నారు. దీనికి కారణాలు ఉండవచ్చు.

కాబట్టి, గురువును వెంబడించాలంటే, లూకా 9:23లో ఆయన తెలియజేసిన షరతులకు లోబడాలి.




అ. **ఎవడైననూ:** ఆయనను వెంబడించడం అనేది స్వతహాగా, ఇష్టపూర్వకంగా చేయాల్సిన పని. బలవంతమేమీ లేదు.

ఆ. **నన్ను:** ఆయనను ప్రభువుగా అంగీకరించడం. ఇక జీవించువాడను నేను కాదు.

ఇ. **వెంబడింపగోరిన యెడల:** ఇది ఒక పని. ఎవరూ ఆపలేని బలమైన కోరిక, ఒక ప్రక్రియ.

ఈ. **తన్నుతాను ఉపేక్షించుకొని:** పాతస్వభావానికి సంబంధించిన విలువలను, ప్రాధాన్యతలను వదులుకోవడం, ద్వంద్వ ప్రమాణాలు ఉండకూడదు.

ఉ. **సిలువను ఎత్తుకొని:** చెల్లించాల్సిన వెల ఉన్నది. శిష్యత్వం చౌకైనది కాదు. యేసుక్రీస్తును వెంబడించడం చాలా ఖరీదైన విషయం. అయితే, ఆయనను వెంబడించకపోవడం ఇంకా ఎక్కువ ఖరీదైన విషయం.

ఊ. **నన్ను వెంబడించవలెను:** విశ్వాసమునకు కర్తయు, దానిని కొనసాగించువాడునైన క్రీస్తువైపు చూడాలి. ఆయన అందరికీ ప్రభువు. శిష్యత్వం అనేది ఒక జీవితకాల ప్రక్రియ. దానిని మధ్యలోనే ఆపివేయడం మంచిది కాదు.

## నేర్చుకోవాల్సిన సత్యాలేమిటి?

ఒక బోధకునిగా ఆయన ఎంతో విజయవంత మైయ్యాడు, ఎంతో ప్రసిద్ధి చెందాడు. ఆయన బోధలు అధికారంతో కూడి అనేకమందిని ఆకర్షించాయి. వారిలో నికోదేము ఒకడు. ఇతను స్వయంగా ఒక బోధకుడు. గానీ, యేసుక్రీస్తును అతను కల ుసుకొన్న సందర్భంలో, 'నీవు దేవుని యొద్దనుండి వచ్చిన బోధకుడవని మేమెరుగుదుము" (యోహాను 3:2) అని అన్నాడు. యేసుక్రీస్తు బోధలు ప్రజలను విస్మయపరచాయి. "ఆ మనుష్యుడు మాట్లాడినట్లు ఎవడును ఎన్నడును మాట్లాడలేదనిరి" (యోహాను

7:46). గొప్ప అధికారంతో, శక్తితో, సరళతతో, నిలకడతో సాధారణ సంఘటనలను, కథలు, ఉపమానాల ద్వారా ఆయన బోధించాడు. మన గురువైన యేసుక్రీస్తు నుండి మనం నేర్చుకోవాల్సింది ఎంతో ఉంది.

**1. మన గురువు యొక్క సత్ప్రవర్తన, గుణము**: సహజంగా గురువు యొక్క గుణము మీద కాకుండా, అతను బోధించే విషయం మీదనే ఎక్కువగా నొక్కిచెప్పడం జరుగుతుంది. క్రీస్తు విషయంలో అలాకాదు. ఆయన బోధలు ఆయన బోధించిన విషయాలు గాక, ఆయన గుణాన్ని ప్రతిబింబించాయి. ఆయన బోధలోను, ఆయన జీవితంలోను మృదుత్వం, నిరాడంబరత కనిపిస్తాయి.

**2. గురువు యొక్క ప్రభావం**: కొంతమంది ఉచ్ఛరణమీద ఎంతగా దృష్టిపెడ తారంటే, అవి వినేవారిమీద ఏ విధమైన ప్రభావం చూపించవు. అయితే, యేసుక్రీస్తు బోధలు మనస్సాక్షిని మేల్కొలిపాయి, మనసును వెలిగించాయి, హృదయాన్ని రగిలించాయి. యావత్ మానవజాతి శారీరిక, సామాజిక, ఆధ్యాత్మిక తృష్ణలను తృప్తిపరిచాయి.

**3. జీవనశైలి, జీవితం యొక్కశైలి**: ఆయన బోధించిన విషయాల ప్రకారమే జీవించాడు. జీవించినదే బోధించాడు. తమ బాహ్య సౌందర్యాల పైనే ఎక్కువ దృష్టిపెడుతున్న ఈనాటి బోధకులులా ఆయన జీవించలేదు.

**4. సరళమైన భావ వ్యక్తీకరణ**: ఇలానే బోధించాలనే పరిమితులు ఆయనకు లేవు. కొన్ని నమూనాల ను ఆయన అనుసరించలేదు. ఎలాంటి పక్షపాతం ఆయన చూపించలేదు. తన శిష్యులలో ఒకరిని ఒకరకంగా, మరొకరిని ఒకరకంగా చూడలేదు. పెద్ద పెద్ద పదాలు ఉచ్ఛరించలేదు. సరళమైన భాష, సామాన్య జీవనం నుండి సరళమైన ఉదాహరణలు ఉపయోగించి ఆయన బోధించాడు. మనుష్యుల ను సంతోషపరచే కుయుక్తులు, చమత్కారాలు, కల్పితమైన మాయమాటలు ఆయన ఎన్నడూ బోధించలేదు.

– రెవ.జి. జెఫన్యా పీటర్
సీనియర్‌పాస్టర్, యునైటెడ్ చర్చ్, బిహెచ్ఇయల్,
హైదరాబాద్

అనువాదం: పి.రామస్వామి, దర్శి

కవిత

# సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ



సిలువ వేయబడిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ
నీతో కూడా మరణించిన హృదయాన్ని నాకివ్వు
దేవునిలో జీవిస్తున్న జీవితాన్ని నాకివ్వు ప్రభూ
నీ రక్తంతో పవిత్రపరచబడిన జీవితాన్ని నాకివ్వు

స్వార్థం చచ్చిన హృదయాన్ని నాకివ్వు ప్రభూ
ఈ లోకానికి చచ్చిన హృదయాన్ని నాకివ్వు
అహానికీ ఆశలకూ చచ్చిన హృదయాన్ని నాకివ్వు
స్వయం స్వచిత్తం చచ్చిన హృదయాన్ని నాకివ్వు

నా పాత స్వభావాన్ని నీ సిలువలో వ్రేలాడదియ్యి
నేనీలోకాన్ని పెంటలా ఎంచుకొనేలా చెయ్యి
లోకాశలన్నీ చచ్చిపోయేంతగా నన్ను పవిత్రపరచు
లోకానికి చచ్చినంతగా నన్ను పరిశుద్ధపరచు

సిలువ వేయబడిన వినయ మనసును నాకివ్వు
సున్నితమైన కరుణగలిగిన మనసును నాకివ్వు
సిలువ వేయబడిన స్వచ్ఛమైన మనసును నాకివ్వు
నీ ప్రతి పిలుపుకు ప్రతిస్పందించే మనసును నాకివ్వు

నా ఆశలు ఆశయాలు సిలువ వేయబడును గాక
నా ప్రేమ పరిపూర్ణతా స్థాయికి చేరుకొనును గాక
నన్ను నా సమస్తాన్ని సిలువకు మేకులతో కొట్టు
నన్ను పూర్తిగా నీ కొరకై సిలువలో సరిదిద్దు

ప్రభూ, నీ మరణం నిరంతరం నాలో ఉండనివ్వు
నా స్వయాన్ని పూర్తిగా సిలువ మేకులకు బంధించు
ప్రతి క్షణం సిలువ వేయబడిన అనుభవం నాకివ్వు
నా స్వరూపాన్ని పూర్తిగా నీ సారూప్యంలోకి మార్చు

– వెస్లీ డ్యూయల్
*(మెజర్ యువర్ లైఫ్ పుస్తకం నుంచి)*



## శిష్యులను తయారుచేయడంలో ప్రభువు అనుసరించిన

# ఏడు వ్యూహాలు

శిష్యులను తయారు చేయడంలో ప్రభువు ఏడు వ్యూహాలను అనుసరించారు. మన విద్యార్థులను మంచి శిష్యులుగా తయారుచేయడంలో విజయవంతం కావాలంటే మనం కూడా ఈ ఏడు వ్యూహాలను ఖచ్చితంగా అనుసరించాలి. తాను ఆరోహణమైన తర్వాత కూడా తన పనిని వారు కొనసాగించేటట్లు ఆయన వారిని తర్ఫీదు చేశాడు. మతసంబంధమైన చరిత్రలోను, దేవుని రాజ్యమైన సంఘస్థాపనలోను భాగస్వాములయ్యే విధంగా ఆయన వారిని తర్ఫీదు చేశాడు. మనం విద్యార్థులను యేసుక్రీస్తు ప్రభువు శిష్యులుగా తయారు చేసే క్రమంలో ఈ ఏడు విషయాలను మనం పాటించాలి. ఈ ఏడు విషయాలు చాలా ఆచరణాత్మకమైనవి. వీటిని మనం స్పష్టంగా అర్థం చేసుకొని, అనుసరించాల్సిన ఆవశ్యకత చాలా ఉన్నది.

### 1. ఎంపిక

యేసుప్రభువు వారిని శిష్యులుగా ఎన్నుకొనే ముందురోజు రాత్రంతా ప్రార్థనలో గడిపాడు. 70 మందిలో 12 మందిని మాత్రమే ఆయన ఎన్నుకొన్నాడు. వారికి అపొస్తలులు అని పేరు పెట్టాడు. ఈ పన్నెండుమందిలో ఒకడు నాశనమయ్యాడు. వారు తనతో ఉండుటకు, అలాగే తన జీవితం, మరణం, పునరుత్థానం గురించి సాక్షులుగా ఉండుటకు ఆయన వారిని ఎన్నుకొన్నాడు. తన శిష్యుల గూర్చి ఒక ఆసక్తికరమైన కథ ఉన్నది. ఆయన పరలోకం వెళ్ళినప్పుడు, తాను ప్రారంభించిన పనిని ఎవరు కొనసాగిస్తారు? దానిని కొనసాగించడంలో ఆ కొద్దిమంది విఫలమైతే పరిస్థితి ఏమిటి? అని దేవదూతలు ఆయనను ప్రశ్నించారు. తన పనిని ఆయన శిష్యులకు మాత్రమే అప్పగించానని, వారు విఫలమైతే ఇక చేసేదేమి లేదని ఆయన జవాబు చెప్పారట. తన కృపను బట్టి, తన భవిష్యత్ జ్ఞానం, తన సార్వభౌమాధికారాలను బట్టి ఆయన వారిని ఎన్నుకొన్నాడు. ఆ 12 మందిలోనూ మరొక అంతరంగిక, అత్యంత సన్నిహితులైన ముగ్గురు శిష్యులు ఉన్నారు. వారే పేతురు, యోహాను, యాకోబు.

అలాగే మనం కూడా కొద్దిమందిని ఎంపిక చేసుకోవాలి. ఎక్కువమందిని కాకుండా ఇద్దరు లేక ముగ్గుర్ని ఎంపిక చేసుకొని, వారిని ప్రభువైన క్రీస్తుయేసుకు అర్హమైన శిష్యులుగా తయారుచేయుటకు మన శక్తి సామర్థ్యాలన్నింటినీ వారిపై వెచ్చించాలి. ఈ వ్యూహం ప్రభువు పాటించిన రెండవ వ్యూహం వద్దకు మనల్ని నడిపిస్తుంది.

### 2. ప్రతిష్ఠ చేసుకోవడం (యోహాను 17:19)

యేసుక్రీస్తు ప్రభువు తన శిష్యుల నిమిత్తమై తనను తాను ప్రతిష్ఠచేసుకొన్నాడు. తన జీవితాన్ని, తన సమయాన్ని, తన శక్తిని, తన డబ్బును, తన బోధను, ఒక్కమాటలో చెప్పాలంటే, తన సమస్తాన్ని ఆయన తన శిష్యుల కోసం ప్రతిష్ఠ చేశాడు. ఆ చిన్నగుంపు కోసం ఆయన తనను తాను ప్రతిష్ఠించుకొన్నాడు. ఆ చిన్న గుంపు మీదే దృష్టి ఉంచాడు. మనుష్యులను పట్టుజాలరులుగా చేయుటకు, వారికి బోధించుటకు,

**మనం మన విద్యార్థుల ముందు ఏం ప్రదర్శిస్తున్నాం? మన ఆత్మీయ, నైతిక, ప్రార్థనా జీవితాలను వారు చూడగలుగుతున్నారా? బైబిల్ స్టడీస్ ఎలా తీసుకోవాలి? వ్యక్తిగత సువార్త ఎలా చెప్పాలి? వంటి విషయాలను మనం మన విద్యార్థుల ముందు ప్రదర్శిస్తున్నామా? వారి పట్ల శ్రద్ధ, ప్రేమలను క్రియల రూపంలో చూపిస్తున్నామా? లేకపోతే ఇప్పుడే ఈ విషయాలను సరిచేసుకొందాము.**

వారికి కాపుదల ఇచ్చుటకు ఆయన అలా చేశాడు. ఒక మంచి కాపరిలా ఆయన వారిని పోషించాడు, సంరక్షించాడు, దేవుని జ్ఞానము విషయంలో వారికి తగిన తర్ఫీదును ఇచ్చాడు. వారు సత్యమందు ప్రతిష్ఠచేయబడునట్లు వారి కొరకై ఆయన తనను తాను ప్రతిష్ఠ చేసుకొన్నాడు (యోహాను 17:19). సీయోను నిమిత్తమై మనల్ని మనం ప్రతిష్ఠ చేసుకోవాల్సిన అవసరం ఉన్నది (యెషయా 62:1). పరిశుద్ధులుగా ఉండుటకు దేవుడు మనల్ని పిలిచాడు (1 థెస్స 4:7). ఏర్పాటు చేయబడిన వారికోసం పౌలు తనను తాను ప్రతిష్ఠ చేసుకొన్నాడు.

ఇదేవిధంగా, విద్యార్థుల రక్షణ కొరకు, వారు పరిశుద్ధతలో ఎదుగుట కోసం మనల్ని మనం ప్రతిష్ఠ చేసుకోవాలి లేక సమర్పించుకోవాలి. మన సమయాన్ని, శక్తిని, డబ్బును మొదలగు వాటన్నిటినీ దేవుడు ఎన్నుకొన్న విద్యార్థుల కోసం మనం వెచ్చించాలి.

### 3. బోధించుట

ప్రభువు ఎన్నుకొన్న మూడవ వ్యూహం బోధించుట. ప్రభువు తన శిష్యులకు అనేక విషయాలు బోధించాడు. వారికి సరైన తర్ఫీదును ఇచ్చే క్రమంలో సమకాలీన పరిస్థితులను ఉదాహరణగా చెప్తూ ఆయన వారికి బోధించాడు. బహిరంగంగాను, వ్యక్తిగతంగాను ఆయన వారికి బోధించాడు. దేవుని రాజ్యం గురించి, తన గురించి, అలాగే ఆధ్యాత్మిక జీవితానికి సంబంధించి అనేక విషయాలు ఆయన వారికి బోధించాడు. ఉపమానరూపంలో, అలంకారాలు జోడిస్తూ ఆయన వారికి బోధించాడు. వ్యక్తిగత ప్రవర్తనకు సంబంధించిన విషయాలను ఆయన వారికి బోధించాడు. ఆయన బోధలు, వారి మధ్య జరిగిన సంభాషణలను వారు జ్ఞాపకం ఉంచుకొని మనలాంటి భవిష్యత్ తరాల వారి ఆత్మీయ అభివృద్ధి కోసం వాటిని రాసి, భద్రం చేశారు. అలా రాతరూపంలో ఉన్న ఆయన బోధలే మనకు లేఖనాలుగా అందించబడ్డాయి.

అదేవిధంగా, మన విద్యార్థులకు మనం మన సిద్ధాంతాలను, బైబిల్‌స్టడీస్, సెమినార్స్ ద్వారా, వ్యక్తిగతంగా మాట్లాడే సమయంలో కొన్ని డివోషనల్ టాపిక్స్‌ను వివరించాలి, బోధించాలి. వారు పరిపూర్ణ విశ్వాసులుగా ఎదిగేటంతవరకు అలా వారికి నేర్పిస్తూ ఉండాలి. వారికి వచ్చే అనుమానాలను మనం తీరుస్తూ, లేఖనాలను సరిగా అర్థం చేసుకొనేటట్లు వారికి మనం తర్ఫీదును ఇచ్చి, టు బైటుల ద్వారా వారిని ఫాలోఅప్ చేస్తూ క్రీస్తులో వారిని మనం బలపరచాలి.

### 4. చేసి చూపించడం లేదా మాదిరి చూపించడం

ప్రభువు ఎన్నుకొన్న నాల్గవ వ్యూహం చేసి చూపించడం లేదా మాదిరి చూపించడం. బోధించడం మాత్రమేకాదు, చేసి చూపించడం ద్వారా ఆయన వారికి అనేక విషయాలు నేర్పించాడు. తన శిష్యుల సమక్షంలో ఆయన అనేక అద్భుతాలు చేశాడు, అనేకమందిని స్వస్థపరిచాడు. పాపం, రోగం, ప్రకృతి, సాతానుల మీద తనకు పూర్తి అధికారం ఉన్నదని ఆయన నిరూపించాడు. వీటన్నిటి ద్వారా ఆయన తనను తాను ప్రత్యక్షపరచుకొన్నాడు. శిష్యుల పాదాలు కడుగుట ద్వారా దీనత్వము వంటి విషయాలను వారికి నేర్పించాడు. తన జీవనశైలిని, తన నైతిక జీవితాన్ని, ప్రార్థనా జీవితాన్ని, తండ్రి మీద ఆధారపడే లక్షణాన్ని తన శిష్యుల ముందు ప్రదర్శించాడు. తన పరలోక మహిమను చూపించి, తన గురించి వారి

కి ప్రత్యక్షం చేసుకొన్నాడు. చివరిగా, తన సిలువ మరణము, పునరుత్థానము, పునరుత్థానము తర్వాత 40 రోజుల్లో 12 సార్లు శిష్యులకు కనిపించుట ద్వారా, తన ఆరోహణం ద్వారా ఆయన తానేంటో శిష్యులముందు నిరూపించుకున్నాడు.

మనం మన విద్యార్థుల ముందు ఏం ప్రదర్శి స్తున్నాం? మన ఆత్మీయ, నైతిక, ప్రార్థనా జీవితాల ను వారు చూడగలుగుతున్నారా?

బైబిల్ స్టడీస్ ఎలా తీసుకోవాలి? వ్యక్తిగత సువార్త ఎలా చెప్పాలి? వంటి విషయాలను మనం మన విద్యార్థుల ముందు ప్రదర్శిస్తున్నామా? వారి పట్ల శ్రద్ధ, ప్రేమలను క్రియల రూపంలో చూపిస్తు న్నామా? లేకపోతే ఇప్పుడే ఈ విషయాలను సరిచేసుకొందాము.

## 5. పని విభజన

ప్రభువు పాటించిన ఐదవ వ్యూహాన్ని చూద్దాం. వివిధ పనులు వారికి అప్పగించడం ద్వారా ఆచరణాత్మక తర్ఫీదును ఆయన తన శిష్యులకు ఇచ్చాడు. ఆయన వారికి పని అప్పగించి, దానిని ఎలా చేయాలో కూడా తెలియజేశాడు. దేవుని రాజ్య సువార్తను బోధించడానికి, రోగులను స్వస్థపరచడానికి, దెయ్యాలను వెళ్ళగొట్టే అధికారాన్ని ఇస్తూ తన డెబ్భై మంది శిష్యులను పంపించాడు. ఐదువేలమందికి ఆహారం పంచే పనిని వారికి అప్పగించాడు. పస్కా విందును సిద్ధపరచే పనిని, గాడిదపిల్లను తెచ్చే పనిని వారితో చేయించాడు. వాక్యాన్ని బోధించుటకు ఆయన వారిని ఇద్దరిద్దరిగా పంపించాడు. తాను చేసిన అద్భుతాలు, స్వస్థతల్లో వారు కూడా భాగస్వాములయ్యేటట్లు చేశాడు.

అలాగే మనం కూడా మన విద్యార్థులకు ఆచరణాత్మక తర్ఫీదును ఇవ్వాలి. నిజానికి యుఇయఫ్ఐ - విద్యార్థుల యొక్క, విద్యార్థులచేత, విద్యార్థుల కొరకు, నడిపించబడుతున్న పరిచర్య. అయినప్పటికీ, జిబియస్‌లు, పిబియస్‌లు, వ్యక్తిగత సువార్త నైపుణ్యాలు, పరిపాలన, నిర్వహణ బాధ్యతలకు సంబంధించిన విషయాలను మనం మన విద్యార్థులకు నేర్పించాలి.

## 6. సరిచేయడం

ఆరవ వ్యూహాన్ని చూద్దాం. అర్థం చేసుకొనే విషయంలో, పనిచేసే విషయంలో శిష్యులు తప్పులు చేసిన అనేక సందర్భాలలో ప్రభువు తన శిష్యులను సరిచేశాడు. పేతురును, ఇతరులను ఆయన కొన్నిసార్లు అభినందించాడు. కానీ, వారి అల్పవిశ్వాసాన్ని బట్టి, వారి ప్రార్థనా లేమిని బట్టి అనేకసార్లు ఆయన వారిని గద్దించాడు. వారి తప్పుడు అభిప్రాయాలను, అజ్ఞానంతో వారు మాట్లాడిన మాటలను అనేకసార్లు సరిచేశాడు. తన గురించి వారు సరిగా అర్థం చేసుకోలేకపోవడాన్ని కూడా అనేకసార్లు గద్దించాడు. ప్రతి సందర్భంలో ఆయన వారిని సరిచేశాడు. వారు పరిపూర్ణతలోనికి వచ్చేటట్లు తగిన తర్ఫీదును వారికి ఇచ్చాడు.

మనం మన విద్యార్థులను అనేక విషయాల్లో సరిచేయాల్సిన బాధ్యత మనకున్నది. వారికి వచ్చే ప్రతి అనుమానాన్ని తీర్చడం, తమ గురించి, ఇతరుల గురించి వారికి ఉన్న తప్పుడు అభిప్రాయాలను సరిచేయడం మన బాధ్యత. ప్రభువు పాటించిన చివరి వ్యూహాన్ని చూద్దాం.

## 7. ఆజ్ఞ

పునరుత్థానుడైన తర్వాత ప్రభువు తన శిష్యులకు కనిపించాడు. తన సన్నిధి, తన శక్తి, తన అధికారాన్ని వారికి వాగ్దానం చేశాడు. చివరిగా, సర్వలోకానికి వెళ్ళి సర్వసృష్టికి సువార్తను ప్రకటించి, సమస్త జనుల ను తన శిష్యులుగా చేసి, ప్రపంచవ్యాప్తంగా తనకు సాక్షులుగా ఉండాలని ఆయన వారికి ఆజ్ఞాపించాడు. ఈ ఆజ్ఞ శిష్యులకు చాలా ప్రాముఖ్యమైనది. శిష్యుల ను ఆయన పరిశుద్ధాత్మ శక్తితో నింపాడు. ప్రభువు తమకు ఇచ్చిన ఆజ్ఞను అనుసరించి శిష్యులందరూ జీవించారు. తమ రక్తంతో వారు క్రీస్తు కొరకు సాక్ష్యాన్ని లేవనెత్తారు.

మనకు కూడా ఆ ఆజ్ఞ ప్రాముఖ్యమైనదే. ప్రేషితసేవా దృక్పథాన్ని, ప్రేషితసేవా మనస్సును మన విద్యార్థుల్లో మనం రగిలించి, ఇతర రాష్ట్రాలకు మిషనరీస్‌గా వెళ్లేటట్లు వారిని ప్రోత్సహించాలి.

ప్రభువు పాటించిన ఈ ఏడు వ్యూహాలు మనం పాటిద్దాం. మనం నిజమైన శిష్యులంగా ఉందాం. క్రీస్తు ప్రభువు శిష్యులుగా ఉండుటకు సాహసం చేయునట్లు మన విద్యార్థులను మనం ప్రోత్సహిద్దాం, తర్ఫీదు చేద్దాం.

– **జక్కి దేవరాజు,** విజయవాడ

ప్రత్యేకం



## క్రమశిక్షణతో కూడిన

# శిష్యరికం

క్రమశిక్షణ లేని శిష్యత్వం, శిష్యరికమే కాదు. శిష్యుడు గురువు గారి అడుగుజాడలలో నడవాలి, ఆయన జీవిత విధానం, ప్రబోధం, అంతా ఉన్నది ఉన్నట్లు అనుకరించాలి. ఒక విశ్వాసి అనుసరించాల్సిన ప్రభువు జీవితక్రమము గొప్ప సవాలుతో కూడిన ఆత్మీయ క్రమశిక్షణ. యేసుప్రభువు జీవితములో క్రమశిక్షణ స్పష్టంగా కనిపిస్తుంది. ఆయన పెందల కడనే లేచి ఒలీవల కొండకు వెళ్ళి ప్రార్థించుట, ఆయన ఉపవాస జీవితము, తండ్రితో ఏకాంతంగా గడపడానికి సమయాన్ని ఏర్పాటు చేసుకోవడం, ప్రభువు యొక్క నిరాడంబర జీవితం, తగ్గించుకొనుట, పరిచర్య, ఇతరులకు ఇవ్వడంలో సిద్ధమనస్సు మనకు శిరోధార్య లక్షణములు. ఒక సంపూర్ణ మానవుడుగా ఆయన జీవితవిధానం మనకు మాదిరి. ఆ మాదిరి అనుసరించడానికి తప్పక అభ్యాసము చేయాలి.

వీటిని ఆత్మీయ అభ్యాసాలు అని అంటారు. వీటిని ఒక వ్యక్తి తన సాధారణ జీవితములో కలిగి ఉండలేదు. తన ఆత్మీయ ఆరోగ్యము కొరకు, ఎదుగుదల కొరకు, పరిపక్వతవైపుకు పయనించడానికి ఇవి తనకు తానుగా విధించుకొనే అలవాట్లు. వీటి ద్వారా అప్పటివరకు తాను అవలంభిస్తున్న జీవిత విధానాన్ని ఆలోచనా విధానాన్ని మార్చుకొని సాంప్రదాయ లౌకిక విషయాల నుండి పారమార్థిక విషయాలపైకి తన జీవన విధానాన్ని మార్చుకొనగలడు. ఈ సాధనలో ఒక పనిని మాటిమాటికి చేయుట ఆత్మసంబంధమైన నిర్ణయాలతో కూడినదై యుండాలి. తద్వారా దేవునితో ఎంతో సన్నిహిత సహచర్యమునకు ఇవి నడిపిస్తాయి. వీటిని మనం అనుకుని పూనుకొంటేనేగాని చేయలేము. కొన్ని కార్యాలు మన ఆత్మీయ ఆరోగ్యానికి అవసరమని తెలిసినప్పటికీ, అవి చేయడానికి మనసు ఉండదు. ఈ ఆత్మీయ అభ్యాసాలు వీటిని చేయడానికి ఒక పద్ధతిని, క్రమమును అందించి, మన ఆత్మీయ ఆరోగ్యాన్ని కాపాడుకొనేటట్లు చేస్తాయి. ఇవి మనము దేవునిని మరింత ఎరగడానికి, మరింతగా ప్రేమించడానికి సహాయం చేస్తాయి. ఇవి కార్యాలు కాని దృక్పథాలు కాదు. ఇవి అభ్యాసము చేయగలవి, గుణశీలాన్నిస్తాయి.

ఈ అభ్యాసాలను కొన్నిసార్లు తప్పు దృక్పథంతో పరిసయ్యులవలె చేసే ప్రమాదం ఉంది. వారు తమ్మునుతాము భక్తిపరులుగా కనుపరచుకోడానికి చేసేవారు. కానీ క్రీస్తుప్రభువు శిష్యుడు ఆయన

స్వరూపము ఏర్పడడానికి చేయు సాధకమే ఈ ఆత్మీయ శిక్షణలు. ఇవి క్రీస్తువలె ఉండడానికి, క్రీస్తుతో కూడా ఉండడానికి సహాయపడే క్రియలు లేక అభ్యాసాలు. ఇవి గమ్యసాధనకు మార్గములే గాని గమ్యము కాదు.

ఆత్మీయ క్రమశిక్షణ రెండు రకాలుగా ఉంటుంది.

అంతరంగ జీవితంలో క్రమశిక్షణ – దీనిని వ్యక్తిగతంగా సాధన చేయాలి. బహిరంగ జీవితంలో క్రమశిక్షణ – దీన్ని సహోదర సంబంధాలతో అభివృద్ధి చేసుకోవాలి.

## అంతరంగ జీవితంలో క్రమశిక్షణ

1. **దేవునితో సమయం గడపడం:** తెల్లవారినప్పుడు అబ్రాహాము లేచి తాను యెహోవా సన్నిధిని నిలిచిన చోటికి వచ్చెను (ఆది 19:27). ప్రతిదినం మనం దేవునితో సమయాన్ని గడపడానికి ఉదయాన్నే లేవాలి. ప్రతి విశ్వాసి దీనిని అత్యంత ప్రాధాన్యతగా ఎంచుకోవాలి.

2. **వాక్యము పఠించడం:** దైవజనుడు సన్నద్ధుడై ప్రతి సత్కార్యమునకు పూర్ణముగా సిద్ధపడి యుండునట్లు దైవావేశము వలన కలిగిన ప్రతిలేఖనము ఉపదేశించుటకును, ఖండించుటకును, తప్పు దిద్దుటకును, నీతియందు శిక్ష చేయుటకును ప్రయోజనకరమైయున్నది (2తిమో 3:16). దైవవాక్య పఠనము శిష్యుని జీవితములో అతిప్రాముఖ్య భాగము. ఒక వ్యక్తిని మనము ప్రేమించినప్పుడు ఆ వ్యక్తిని గూర్చిన సమాచారం సాధ్యమైనంత సంపాదిస్తాము. దేవుని గూర్చిన పఠనము మనలను దేవునితో ప్రేమలో పడడానికి నడిపిస్తుంది.



3. **దేవుని భయం:** దేవుని భయం చాలా మందిలో లేదు. "దేవుని భయం ప్రతి సంఘంలో అంతరించిపోతుంది" అని ఒక దైవజనుడు అన్నాడు. ఎక్కడైతే భయం ఉండదో అక్కడ పాపం, విచ్చలవిడితనం ఉంటుంది. అందుకే "మీరు పరదేశులై ఉన్నంతకాలం భయంతో గడుపుడి" అని దేవునివాక్యం చెబుతుంది.

4. **అర్థవంతమైన ప్రార్థన, ఉపవాస ప్రార్థన సమయం కలిగివుండడం:** మనము కనికరింపబడి సమయోచితమైన సహాయము కొరకు కృప పొందునట్లు ధైర్యముతో కృపాసనము నొద్దకు చేరుదము. హెబ్రీ 4:16

   ప్రార్థనా జీవితములో విశ్వాసులనేకమంది ఓడిపోవడానికి కారణము, ప్రార్థన చేయడాన్ని ఒక ఆత్మీయ క్రమశిక్షణగా ఎంచకపోవడమే. దేవుని సన్నిధిని ప్రవేశించడానికి దేవుడేర్పాటు చేసిన మార్గము ప్రార్థన. అక్కడే దేవునితో సహవాసము, ప్రార్థనలో శిష్యుని మనసు నిత్యత్వపు ఉనికిని తాకి పరలోక సంబంధమైన తలంపులతో నింపబడుతుంది. అలాగే ఉపవాసం ద్వారా శిష్యుడు భౌతిక కోరికలను కాదనుకొని, ఆత్మసంబంధమైన శక్తిని సున్నితత్వమును పెంపొందించుకొనగలడు. దైవగ్రంథములో ఉపవాసము చేసినవారు, అతిశ్రేష్ఠమైన ఆత్మీయ లాభమును పొందుటకు తమ శరీరములకు విలువైన భౌతిక ఆహారమును కాదనుకొని తమ్మును దేవునికి అప్పగించుకొన్నారు.

5. **సాధారణ జీవితం:** ఏ స్థితిలో ఉన్నను ఆ స్థితిలో సంతృప్తి కలిగియుండ నేర్చుకొని యున్నాను (ఫిలిప్పీ 4:11).

   సాధారణ జీవితం అనగా లోకసంబంధమైన విలువల నుండి విడుదల పొంది నిజమైన ఆనందం, తృప్తి అనుభవించుట. తమ అక్కరలకు, విలాసాలకు మధ్యగల భేదాన్ని గుర్తించగలిగినవారే ఈ జీవితం జీవించగలరు. సాధారణ జీవితం నేత్రాశ నుండి, నోటి ఆశ నుండి, హృదయ ఆశల నుండి కాపాడుతుంది.

6. **వ్యక్తిగత పరిశుద్ధత:** దేవునితో అర్థవంతమైన సహవాసంలో సమయం గడిపినప్పుడే ఇది

సాధ్యమౌతుంది. పాపాన్ని చేయకుండటమే కాదు, అంతరంగంలో పాపాన్ని ద్వేషించాలి. యూదా1:23. పరిశుద్ధత అనుమాట బైబిల్ లో1060 సార్లు ఉపయోగించబడింది. దీనిని బట్టి పరిశుద్ధ జీవితం యొక్క ప్రాముఖ్యత మనకు అర్థమౌతుంది.

7. **ఆత్మ దేవునికి విధేయత, సమర్పణ:** మనలో పరిశుద్ధాత్ముడు నివాసం ఉన్నాడనే విషయం ఎల్లప్పుడు గ్రహిస్తూ ఆ ఆత్మదేవుని నియంత్రణలో ఆయన అధికారానికి, నడిపింపుకు లోబడుతూ సమర్పణ కలిగి ఉండాలి.

8. **గృహనిర్వాహకత్వం:** మనకున్నవన్నీ ప్రభువిచ్చినవే అని గుర్తెరిగి మన సమయం, తలాంతులు, ద్రవ్యంను ఆయన కొరకు ఇచ్చేవారంగా ఉండాలి. ఆయన మనకు యజమాని అని మనం గృహనిర్వాహకులం అని గుర్తెరగాలి.

9. **వ్యక్తిగత పరిశీలన, ఒప్పుకోలు:** అతిక్రమముల ను దాచిపెట్టువాడు వర్ధిల్లడు వాటిని ఒప్పుకొని విడిచిపెట్టువాడు కనికరము పొందును (సామె 28:13).

10. **కృతజ్ఞతతో స్తుతి ఆరాధన:** యెహోవా నామమునకు తగిన మహిమను ఆయనకు చెల్లించుడి నైవేద్యములు చేతబుచ్చుకొని ఆయన సన్నిధిని చేరుడి పరిశుద్ధాలంకారములగు ఆభరణములను ధరించుకొని ఆయనయెదుట సాగిలపడుడి.1 దిన 16:29. నిరంతరం మనసులో కృతజ్ఞత, స్తుతి దృక్పథాన్ని కలిగి ఉండాలి. 1థెస్స 5:16 ప్రకారం ప్రతి విషయము నందును కృతజ్ఞతాస్తుతులు చెల్లించాలి.

11. **సహవాసం:** ప్రభువులో ఆనందించడము – వీరు అపొస్తలుల బోధయందును సహవాసమందును, రొట్టె విరుచుటయందును ప్రార్థన చేయుట యందును ఎడతెగక యుండిరి (అపో.కా 2:42). కొందరు మానుకొనుచున్నట్టుగా, సమాజముగా కూడుట మానక, ఒకనినొకడు హెచ్చరించుచు, ఆ దినము సమీపించుట మీరు చూచిన కొలది మరి యెక్కువగా ఆలాగు చేయుచు, ప్రేమ చూపుటకును సత్కార్యములు చేయుటకును ఒకనినొకడు పురికొల్పవలెనని ఆలోచింతుము (హెబ్రీ 10:25).

## ఆత్మీయ క్రమశిక్షణ వలన ప్రయోజనాలు

- ❖ ఆత్మీయ క్రమశిక్షణ మనలను దైవత్వానికి నడిపిస్తుంది. దైవత్వం అంటే, యేసు ప్రభువులా జీవించడం, ఆయనలా ఆలోచించడం.
- ❖ ఆత్మీయ క్రమశిక్షణ పాటించడం ద్వారా దేవుని సంతోషపెట్టడం ఎలాగో మనం తెలుసుకొంటాము (యోహా 8:28,29). కావున యేసు–మీరు మనుష్యకుమారుని పైకెత్తినప్పుడు నేనే ఆయనననియు, నా అంతట నేనే యేమియు చేయక, తండ్రి నాకు నేర్పి నట్టు ఈ సంగతులు మాటలాడుచున్నాననియు మీరు గ్రహించెదరు. నన్ను పంపినవాడు నాకు తోడైయున్నాడు; ఆయన కిష్టమైన కార్యము నేనెల్లప్పుడును చేయుదును గనుక ఆయన నన్ను ఒంటరిగా విడిచిపెట్టలేదని చెప్పెను.
- ❖ దేవుని వాక్యము ద్వారా దేవుని మార్గాలు, ఆయన ఉద్దేశాలు, ఆయన చిత్తం, ఆత్మీయ ప్రమాదాలు, ఆత్మీయ క్షేమము మనం నేర్చుకొంటాము.
- ❖ ఆత్మీయ క్రమశిక్షణ ద్వారా మనం నిత్యం దేవుని సన్నిధిని అనుభవించగలం. లూకా 5:16 ఆయన ప్రార్థన చేయుటకు అరణ్యములోనికి వెళ్లుచుండెను.
- ❖ దేవుని భయం, దేవుని సంరక్షణ మనలను విశ్వాసంలో బలపరుస్తాయి.

## ఆత్మీయ క్రమశిక్షణ వాక్యానుసారం

హెబ్రీ 12:11 మరియు ప్రస్తుతమందు సమ–స్త శిక్షయు దు:ఖకరముగా కనబడునే గాని సంతోషకరముగా కనబడదు. అయినను దానియందు అభ్యాసము కలిగిన వారికి అది నీతియను సమాధానకరమైన ఫలమిచ్చును.

సామె 12:1 శిక్షను ప్రేమించువాడు జ్ఞానమును ప్రేమించువాడు గద్దింపును అసహ్యించుకొనువాడు పశుప్రాయుడు.

సామె13:24 బెత్తము వాడనివాడు తన కుమారునికి విరోధి కుమారుని ప్రేమించువాడు వానిని శిక్షించును.

1కొరింథీ 9:27 గాలిని కొట్టినట్టు నేను పోట్లాడుట

లేదు గాని ఒకవేళ ఇతరులకు ప్రకటించిన తరువాత నేనే భ్రష్టుడనై పోదునేమో అని నా శరీరమును నలగగొట్టి, దానిని లోబరచుకొనుచున్నాను.

### క్రమశిక్షణ కలిగిన వ్యక్తి దానియేలు

బబులోను విశ్వవిద్యాలయంలోని దానియేలు ను ఒకసారి చూద్దాం. బబులోను అధిపతియగు నెబుకద్నెజరు అతనిని బానిసగా బబులోను చెరకు తీసుకొని వెళ్ళాడు. అలాంటి పరిస్థితుల్లో కూడా దేవునిని, ఆయన ప్రణాళికను నమ్మాడు. ఆయన జీవితంలో ఆత్మీయ క్రమశిక్షణను గమనిస్తే..

పరిశుద్ధంగా ఉండడానికి ధైర్యం చూపించాడు (దాని 1:8) రాజు భుజించు భోజనమును పానముచేయు ద్రాక్షారసమును పుచ్చుకొని తను అపవిత్రపరచుకొనకూడదని దానియేలు ఉద్దేశించి, తాను అపవిత్రుడు కాకుండునట్లు వాటిని పుచ్చుకొనకుండ సెలవిమ్మని నపుంసకుల యధిపతిని వేడుకొన్నాడు. తాను ఉద్దేశించిన దానిని, దేవుని చిత్తం చేయడానికి ధైర్యం చూపించాడు.



బబులోనీయులు అతని పేరు మార్చారు కానీ అతని మతాన్ని మార్చలేక పోయారు. అతనికి కల్దీయుల పద్ధతులు, సంస్కృతి నేర్పగలిగారు కానీ, అతని దేవుని మరపించలేక పోయారు.

దానియేలు శారీరకంగానే కాదు, ఆత్మీయంగాను ఉన్నతుడు. అతను ప్రార్థనాపరుడు, తన స్నేహితుల ను కూడా ప్రార్థనకు పిలిచాడు.

యథార్థ పరుడు: దైవభక్తి లేని దేశంలో భక్తిపరునిగా యథార్థంగా జీవించాడు. రాజీపడలేదు.

### దానియేలు జీవితం ఆత్మీయ క్రమశిక్షణలో ఎదగడానికి 4 కారణాలు

- ❖ స్థిరమైన పునాది, దేవునితో స్థిరమైన సహవాసం
- ❖ శత్రువు వ్యతిరేకతను తట్టుకోవడం
- ❖ క్రమశిక్షణ గలిగిన ప్రార్థనా జీవితం
- ❖ దేవుని మంచితనాన్ని స్థిరంగా నమ్మడం.

– యం.యస్.రవికుమార్, నెల్లూరు

## హైకూలు

సిలువను క్రైస్తవులు మొయ్యాలి
గుడి మీద నిలువ బెట్టారు

..........

దేవుని కోసం మండేవాడు
కాలిపోడు

..........

ప్రేమించడం మానేశాడు
పదండి, పాతిపెడదాం!

..........

సంఘంలో తుఫాను
యోనాను దించెయ్యండి

..........

చీమలు
సోమరి పాఠ్యపుస్తకాలు

..........

నీలోని దేవుణ్ణి చూడాలి
నువ్వెందుకు, అడ్డం!

..........

గాజులాంటి జీవితం
దేవుని చేతిలో భద్రం!

..........

గాడిదవు, నీకు చర్చిలో ఏం పని?
బిలాము వచ్చాడేమోనని!

..........

సమస్యలు –
మనిషికంటే పెద్దవి
దేవుని కంటే చిన్నవి.

..........

ఎంత గొప్పగా చేసావు నన్ను!
నువ్వు కూడా నాలో సరిపోయావు!!

– ప్రసాద్ తాళ్ళూరి


# ఉపేక్షించుకోవడం

"మరియు ఆయన అందరితో ఇట్లనెను -ఎవడైనను నన్ను వెంబడింప గోరినయెడల తన్నుతాను ఉపేక్షించుకొని, ప్రతిదినము తన సిలువను ఎత్తికొని నన్ను వెంబడింపవలెను" (లూకా 9:23). ఆయనను వెంబడించుట అనగా ఆయనకు శిష్యుడుగా ఉండడాన్ని కోరుకోవడం. ఇదే విషయాన్ని లూకా తన సువార్తలో మరొకచోట చెప్పాడు. "ఎవడైనను తన సిలువను మోసికొని నన్ను వెంబడింపని యెడల వాడు నాకు శిష్యుడు కానేరడు" (లూకా 14:27). ఇదే విషయాన్ని మత్తయి తన సువార్తలో మరొక విధంగా చెప్పాడు. "ప్రభువు ఆజ్ఞాపించిన సంగతులన్నింటిని అనుదినము అను-సరిస్తూ జీవించడమే శిష్యులుగా ఉండటం" (మత్తయి 28:20). దీనిని ఇంకా స్పష్టంగా చెబితే - "**ఆ**యన **ఆ**జ్ఞాపించిన సంగతులను **అ**న్నింటిని **అ**నుదినము **అ**నుసరించుట" - దీనినే శిష్యత్వమని చెప్పవచ్చు. మత్తయి, లూకాలో రాసిన వాటిని కలిపి చదివినప్పుడు రెండు విషయాలు అర్థమవుతాయి. "ఆయన ఆజ్ఞాపించిన సంగతులను అన్నింటిని అనుదినము అనుసరించడం, తననుతాను ఉపేక్షించుకొని తన సిలువను ఎత్తుకోవడం. ఈ రెండు సంగతుల ను నెరవేర్చడానికి అంగీకరింపనివాడు ఆయనకు శిష్యుడుగా ఉండనేరడు.

## కోరికల్ని ఉపేక్షించుకోవాలి

దావీదు మహారాజు, ఇశ్రాయేలీయుల 12 గోత్రాలను పరిపాలించిన రాజు. ఈయన ఒకరోజు సాయంకాల సమయంలో రాజనగరి మిద్దె మీద నడుస్తూ బహుసౌందర్యవతియైన ఊరియా భార్యను చూశాడు (2 సమూ 11:2-3). తన హృదయములోనున్న "జారత్వము" తనలో పని చేయసాగింది. దావీదు యొక్క శరీర కోర్కెలు తీర్చడానికి దావీదు భార్యయైన అబీగయీలు దావీదుతో నివసిస్తుంది. దావీదు భార్యతో సంతోషించాలి, సుఖించాలి. అది దేవుని చిత్తము. అబీగయీలు మాత్రమే కాదు ఇంకను దావీదుకు భార్యలు ఉన్నారు (2 సమూ 3:2-5). తన భార్యతో సంతోషించి, సుఖించక పరపురుషుని భార్యను దావీదు కోరుకొన్నాడు. అందువల్ల దేవుని ఉగ్రత దావీదు మీదికి వెంటనే వచ్చింది. దావీదు బ్రతికినంతకాలము సదాకాలము యుద్ధములే.

జ్యేష్ఠకుమారుడైన అమ్నోను - బహుక్రూరముగా కత్తులతో నరకబడి చంపబడ్డాడు (2 సమూ 13:28). దావీదు




మరొక కుమారుడు అబ్షాలోము. అతనంతటి సౌందర్యము గలవాడు మరొకడు లేడు (2 సమూ 14:25). అతనిని దావీదు సైన్యాధిపతియైన యోవాబు చంపాడు (2 సమూ 18:15). దావీదు మరియొక కుమారుడు అదోనియా - అతనిని సొలొమోను చంపించాడు (1 రాజులు 2:25). దావీదుకు పుట్టిన మరియొక కుమారుని దేవుడే చంపాడు (2 సమూ 12:16-19). ఇలా ఖడ్గం దావీదును తరిమింది. మరణం, రక్తం, దు:ఖం, వేదన, ఆవేదన, అవమానం.. ఇవన్నీ దావీదు మీదకి వచ్చాయి. ఎందుకంటే దావీదు హృదయములో పుట్టిన కోరిక - "ఊరియా భార్యను ఆశించడం" వలన. దావీదు తనలో పుట్టిన కోరికను ఉపేక్షించలేదు. ఆ కోరికను ఆపేక్షించాడు. అందువలన దేవుడు దావీదును బహుగా శిక్షించాడు. దావీదు బతికినంతకాలం దు:ఖమే, మరణమే. ఖడ్గము రక్తమును ఒలికించుచు దావీదును తరిమింది.

దావీదు తన హృదయములో పుట్టిన కోరికను ఉపేక్షించి ఉంటే ఎంత బాగుండేది! దావీదు ఎంత క్షేమంగా ఉండేవాడు. రెండవది, తన సిలువను ఎత్తికొనుట. తన సిలువను ఎత్తికొనుట అంటే ఏంటి? క్రీస్తుయేసు సంబంధులు శరీరమును దాని యిచ్ఛలతోను దురాశలతోను సిలువ వేసియున్నారు (గలతీ 5:23,24).

## శరీరకార్యాలను సిలువకు అప్పగించాలి

సిలువను ఎత్తికొనుట అంటే మనలోనున్న శరీరకార్యాలను సిలువకు అప్పగించుట. దావీదు జారత్వము చేత ఈడ్వబడినపుడు, దేవుని సన్నిధిలో తన పాపమును ఒప్పుకొని ఉంటే ఆయనలోనున్న పరిశుద్ధాత్మ దేవుడు జారత్వమును మేకులతో సిలువకు కొట్టి, చంపి, సమాధి చేసి దావీదును పాపము నుండి విడిపించేవాడు. అయితే దావీదు దేవునిని లక్ష్యము చేయలేదు, దేవుని మాటను తృణీకరించాడు (2 సమూ 12:9,10). అందువల్ల అతనిలోనున్న శరీరకార్యములు (గలతీ 5:19-21) అతనిని వశపర్చుకున్నాయి. దావీదు జారత్వానికి బానిసయ్యాడు. విస్తారమైన వెల చెల్లించాల్సి వచ్చింది.

శిష్యునిగా దేవుని మాటకు లోబడి జీవిస్తూ ఉంటే కొంచెము వెల చెల్లిస్తాము. శిష్యత్వాన్ని జరిగించకుండా, దేవుని మాటను తృణీకరిస్తే విస్తారమైన వెల చెల్లించాల్సి



వస్తుంది. దావీదు దేవునికి లోబడకపోవడం వల్ల అతడు చెల్లించిన వెల బహు గొప్పది. అందువలన ప్రతి విశ్వాసి గుర్తించు కోవాల్సిన విషయం ఏంటంటే.. ఈ లోకములో ధైర్యముగా తలెత్తుకొని జీవించాలని అనుకొంటే దేవుని చిత్తము చేయడానికి మనలను మనం ఉపేక్షించుకొందాం. దేవుని కొరకు మన కోరికలను, మన ఆశలను తృణీకరించి దేవుని వాక్యమును అనుసరిద్దాము, దేవుని ఆశీరాదాన్ని పొందుకొందాం..

ఆయనను అంగీకరించడం అనగా ఆయన నామమునందు విశ్వాసముంచుట (యోహాను 1:12) అని రాయబడింది. దావీదు బత్షెబ విషయములో దేవునిని అంగీకరింపలేదు. ఆయనను తృణీకరించాడు, ఆయనను లక్ష్యము చేయలేదు. ఆయన మీద ఆనుకోలేదు. ఆయన మీద విశ్వాసముంచలేదు. దేవునియందు విశ్వాసముంచువాడు దేవునికి తనను తాను అర్పించుకుంటాడు. ఆయనమాటను ఘనపరుస్తాడు, గౌరవిస్తాడు. ఈ విషయములో దావీదు పూర్తిగా విఫలమయ్యాడు. అందువలన విస్తారమైన వెల చెల్లింపవలసి వచ్చింది. మనము ప్రభువునందు విశ్వాసముంచుదాం. మన జీవితాలను ఆయనకు అర్పించుకొందాం. పాపపు కోరిక మన హృదయంలో మొలకెత్తినప్పుడు వెంటనే ప్రభువు సన్నిధికి వెళ్ళి చెప్పుకొందాం. కృప గల దేవుడు మనలోనున్న శరీరకార్యములను సిలువకు కొట్టి చంపివేస్తాడు, ప్రతీ దురాశ, కోపము, అసూయ, గర్వము, స్వార్థము, విమతము, కలహము

ప్రభువుకు చెప్పుకొందాం. మనము పాపమును ఒప్పుకొనకపోతే పరిశుద్ధాత్మ దేవుడు మన పక్షముగా పనిచేసి పాపపు నైజాన్ని చంపివేయడం జరగదు. శరీరక్రియలను సిలువకు కొట్టి చంపివేసేవాడు పరిశుద్ధాత్మ దేవుడు. ఆయన మనలో పని చేయాలంటే మన హృదయములో చెలరేగే ప్రతి పాపపు తలంపును ఆయనకు చెప్పుకోవాలి, ఆయన సన్నిధిలో ఒప్పుకోవాలి. అప్పుడు ఆ పాపపు కోరిక సిలువకు కొట్టబడి చంపబడుతుంది. ఇట్లు మనలోనున్న ప్రతి శరీరకార్యమును సిలువకు అప్పగించుట "తన సిలువను మోసికొనుటయే". మనలోనున్న ప్రతి శరీర కార్యములు సిలువకు అప్పగింపబడి చంపబడకపోతే ఆ శరీరేచ్ఛలు మనలను సర్వనాశనము చేస్తాయి.

### మన జీవితాన్ని ప్రభువుకు అప్పగించుకోవాలి

శరీరకార్యములను చంపుటకు (రోమా 8:13) దేవుడు మనకు యేసుక్రీస్తు ప్రభువు నామములో పరిశుద్ధాత్మను కుమ్మరించాడు. సకల ప్రజలందరి మీద తన ఆత్మను దేవుడు క్రుమ్మరించాడు. సకల జనుల మీద నా ఆత్మను కుమ్మరింతును (యోవేలు 2:28) అని చెప్పిన దేవుడు తన వాగ్దానమును మన అందరి కొరకు నెరవేర్చాడు. అందుకే మనము జీవించు జీవితములో ఆయన ఆత్మను మనకు ఇచ్చాడు. ఆయన ఆత్మకు మనము అప్పగించుకొన్నప్పుడు మనలోనున్న శరీర క్రియలన్నిటిని మేకులతో సిలువకు కొట్టి, చంపి, సమాధి చేసి మన హృదయములను ఆత్మఫలముతో నింపి మనలను ప్రతి నిమిషము నడిపిస్తాడు. ఇంత గొప్ప భాగ్యమును మనము తృణీకరించకూడదు. మనము గుర్తించిన ప్రతి పాపపు కోరికను ఆయన దగ్గర ఒప్పుకొని మనలను మనము దేవునికి అప్పగించుకోవాలి. అప్పుడు సమస్త దీవెనలు మనము పొందగలము. విశ్వాసములో దినదినము ఎదుగుతాము.

మనము ఒప్పుకొనని పాపపు కోరిక, పాపపు ఆలోచన, పాపపు ఇచ్ఛ, పాపపు తలంపు – మనలో ఉన్నట్లయితే – మనము దేవునిని తృణీకరించేవారమవుతాము, ఆయనయందు విశ్వాసము లేనివారము అవుతాము. మన నాశనముకు మనమే కారణము అవుతాము.

– డా. పి. సిరాజ్
ఇవాంజిలిస్ట్, విజయవాడ

# ఒప్పందం



క్యాంపస్ క్రూసేడ్ ఫర్ క్రైస్ట్ వ్యవస్థాపకుడు బిల్‌బ్రైట్ ఇరవైయవ శతాబ్దపు గొప్ప క్రైస్తవ నాయకుల్లో ఒకరు. ఆయన నాయకత్వంలో 'నాలుగు ఆధ్యాత్మిక సూత్రాలు' అనే కరపత్రం, 'యేసుక్రీస్తు జీవిత చరిత్ర' అనే చిత్రాన్ని ప్రపంచ వ్యాప్తంగా 400 మిలియన్స్ ప్రజలు చదవడానికి, చూడడానికి క్రూసేడ్ స్టాఫ్ ఎంతో శ్రమించారు. వారిలో 150 మిలియన్స్ ప్రజలు దేవునిని అంగీకరించి ఆయనతో నిత్యత్వంలో గడపటానికి తీర్మానించుకొన్నారు. 191 దేశాల్లో, 26,000మంది పూర్తికాల సేవకుల్ని, 2,25,000 మంది శిక్షణ పొందిన వాలంటీర్లు గల ఈ పరిచర్యను గమనించిన రిక్ వారెన్ బిల్‌బ్రైట్‌ను "దేవుడు ఎందుకు ఇంతగా దీవించాడు?" అని ప్రశ్నిస్తే, దీనికి ఆయన సమాధానం –

**"నా యౌవన జీవితంలో దేవునితో నేను ఓ ఒప్పందం ఇలా కుదుర్చుకున్నాను. 'ఈనాటి నుండి నేను క్రీస్తుకు బానిసను అని కాగితం మీద రాసి దాని కింద సంతకం చేశాను".**

నీవు ఎప్పుడైనా దేవునితో ఈ విధంగా ఒప్పందం చేసావా?

ఆయనకు ఇష్టమైనట్లు జీవించకుండా, పూర్తిగా ఆయనకు సమర్పించుకోకుండా ఇంకా అవిధేయతతోనే జీవిస్తున్నావా?


# దైనందిన జీవితానికి దిక్సూచి

## ధన్యతల్లో దాగివున్న మౌలిక విలువలే!

### మత్తయి 5:3–11

మనుష్యులకు ఆశీర్వాదాలు పొందడమంటే చాలా సంతోషం. భక్తుల తలపై చేయిపెట్టి ప్రార్థిస్తే ఆశీర్వాదాలు వస్తాయని నమ్మే విశ్వాసులు కోకొల్లలు. ఫలానా విధంగా ప్రార్థిస్తే లేక చేస్తే ఆశీర్వాదాలు వస్తాయని ఎవరైనా తెలియజేస్తే, ఎంత కష్టమైనా, ఎంతఖర్చు అయినా చేయడానికి వెనుదీయని క్రైస్తవులు, విశ్వాసులమని చెప్పుకొనేవారు చాలామంది. మన భారతదేశంలో ఈ విధమైన బోధలతో మనుష్యులను మోసగించి కోట్లకుపడగలెత్తిన దొంగ సాధువులు, టివి బోధకులకు లెక్క లేదు. ప్రజలు ఆశీర్వాదాల కోసం పడే తపన, ఆతురత వారి అజ్ఞానములో నుండి, స్వార్థంలోనుండి వచ్చినవే. చాలా మందికి ఆశీర్వాదాలు, కృపలకు మధ్యగల భేదం తెలియదు. పాతనిబంధనలోని సంఘటనలు, విషయములు కొత్త నిబంధనలోని వాస్తవికతకు ఛాయరూపములని దైవవాక్యం స్పష్టంగా బోధిస్తుంది (కొలస్సీ 2:17). పాతనిబంధనలోని భౌతిక సంపద, వస్తుసామాగ్రి, బంగారు వెండి, పశుసంపద క్రొత్తనిబంధనలోని ఆత్మీయజీవితములో దేవుడనుగ్రహించు – సువర్ణము కంటె విలువైన విశ్వాసము, విలువ కట్టలేని నిత్యజీవము, డబ్బుతో కొనలేని సంతోష సమాధానములు, దేవుడు తన ప్రాణమును అర్పించి సంపాదించిన నిత్యక్షమాపణ మొదలగు ఆశీర్వాదములకు ఛాయరూపకముగానున్నవని గ్రహింపగలము. ఆ కారణము చేత, నూతన నిబంధన ప్రారంభంలోనే పరిశుద్ధాత్మ దేవుడు, ఒక వ్యక్తి నిజంగా ఆశీర్వదింపబడుట అనగానేమిటో, ఆశీర్వాదాన్ని అనుభవించడానికి గల నిబంధనలేమిటో రాయించి పెట్టాడు. మత్తయి 5:3–11లో పేర్కొనబడిన ఎనిమిది ధన్యతలు/ఆశీర్వాదముల గురించి కొద్దిసేపు ఆలోచిద్దాం.

ఆత్మవిషయమై దీనులైన వారు ధన్యులు. పరలోకరాజ్యము వారిది అని చెప్పుడంలో దేవుని రాజ్యమునకు ఒక వ్యక్తి ఏవిధంగా వారసుడు కాగలడో ఈ అద్భుత ఆశీర్వాదానికి పాత్రుడగుటకు షరతులను స్పష్టంగా చెప్పారు. ఒక వ్యక్తి దేవుని ఆశీర్వాదాలకు హక్కుదారుడు కావాలంటే అతడు



ఈ మార్గం ద్వారా రావలసిందే! దేవునితో ఒక వ్యక్తికి సంబంధం ఏర్పడడం ఆశీర్వాదాలకు ప్రారంభం. బైబిల్‌లోని సారమంతా ఇదే! ఈ లోకములోఆశీర్వదించబడిన వారు ఎవరు? ధనవంతులా? శక్తిమంతులా? దీర్ఘాయుష్మంతులా? వీరెవరు కాదు. కేవలం దేవునితో సంబంధం గల వారు మాత్రమే!

ఆత్మ విషయమై బీదలైనవారు తమ ఆత్మీయ దారిద్ర్యమును గుర్తించి, దేవుని ఎదుట తమ ఆత్మీయ అపరిపక్వతను ఒప్పుకొనినవారు. ఈ ఒప్పుదల వారిలో కలిగించిన వాడు పరిశుద్ధాత్మ దేవుడే. ఈ ఎరుక వారిలో లోతైన పశ్చాత్తాపాన్ని కలిగిస్తుంది,తమ పాపస్థితిని అసహ్యించుకొనేటట్లు చేస్తుంది, దేవుని ముందు వారు దోషులని ఒప్పుకొనేటట్లు చేస్తుంది, ఆకాశమువైపు తల ఎత్తుకోవడానికి ధైర్యము లేనివారిగా చేస్తుంది, దేవుడు మానవుని పతన/పాపపరిస్థితిని ఏవిధంగా చూస్తాడో ఆవిధంగా చూడడానికి సహాయం చేస్తుంది. తద్వారా రక్షకుని అక్కర వానిలో పుట్టిస్తుంది. రక్షకుని పాదాలపై పడి క్షమాపణ అర్థించేటట్లు చేసి, దేవుడు ఉచితంగా అనుగ్రహించు క్షమాపణకు, నీతికి వారసులుగా చేసి దేవుని రాజ్యనివాసులుగా చేస్తుంది. నిత్యమైన అగ్నిగుండం నుండి శాశ్వతంగా విడుదల కలిగిస్తుంది. దేవుని కుటుంబంలో సభ్యులుగా చేస్తుంది. ఇంతకన్నా గొప్ప ఆశీర్వాదం ఏమి ఉంటుంది!

దు:ఖపడువారు ధన్యులు వారు ఓదార్చబడుదురను ఆశీర్వాదము మొదటి ఆశీర్వాదముతో ముడిపడి ఉంటుంది. ఒక పాపి తన ఆత్మీయపరిస్థితి, దాని పర్యవసానం గుర్తించిన తర్వాత దు:ఖించకుండా ఉండలేడు. లోతైన పశ్చాత్తాపం మానవునిలో అవసరమైన దు:ఖం తీసుకొని వస్తుంది. ఇది దేవుని రాజ్య నిర్మాణానికి పునాదిలాంటిది. దేవుని ముందు తాను అంగీకరించబడడానికి తన దగ్గరేమీలేదని గుర్తిస్తే మానవుని గుండెలోనుండి దు:ఖము, బాధ పెల్లుబికివస్తాయి. పాపము వాని జీవితానికి ఏమిచేసిందో, దేవునిని ఎంత బాధపరచిందో గ్రహించినప్పుడు గుండెలవిసేటట్లు విలపించి, దు:ఖించడం జరుగుతుంది. ఈ దైవిక దు:ఖము మారుమనసుకు నడిపిస్తుంది.

మనుష్యులు తమజీవితాలలో కోరుకున్నది దక్కనప్పుడు, తమ ఆశభంగమైపోయినప్పుడు, తమ కలలు కూలిపోయినప్పుడు, తమ ప్రియులను కోల్పోయినప్పుడు పొందు దు:ఖమును గూర్చి ప్రభువు మాట్లాడుటలేదు. అటువంటి దు:ఖము మరణకరమైనదని 2 కొరింథీ 7:10లో రాయబడివుంది. పశ్చాత్తాపానికి నడిపించే దైవిక దు:ఖము నిత్య సంతోషానికి నడిపిస్తుంది. యాకోబు 4:9,10 వచనాలలో రాయబడిన దు:ఖము ఇటువంటి దు:ఖమే. ఈ దు:ఖము గొప్ప ఆశీర్వాదానికి పాత్రులుగా చేస్తుంది. ఈ దు:ఖము యొక్క అనుభవములేక ఎంతోమంది యుగయుగాలు ఆహాకారాలు పెట్టే, పండ్లు కొరుకుతూ ఉండే స్థలానికి వెళ్తున్నారో లెక్కలేదు. నాకు, నీకు ఈ దు:ఖము కలుగ చేసి ఆశీర్వదించిన ప్రభువుకు కృతజ్ఞతలు. మనము ఓదార్చబడ్డాము. ఓదార్చబడిన వారి కళ్ళు ఇంకా కన్నీరు కారుస్తూ దేవుని పాదములను ఆశ్రయించి ఓదార్చబడని అనేకుల కొరకు ప్రార్థించాలని, వాని కన్నీటిలోనుండి అనేక గృహాలలోనికి ఆశీర్వాదం ప్రవహించాలని దేవుని కోరిక. వారు కన్నీటితో విత్తి సంతోషగానముతో పనలు మోసికొని రావాలని దేవుని ఆశ (కీర్తనలు 126:5,6). ఈవిధంగా తమ తరములో వారు ఆ ఆశీర్వాదానికి నిలయంగా మారాలని దేవుని ఆశయం. నీవు ఆ ఆశయ సిద్ధికి సహకరించగలవా?

సాత్వికం బలహీనత కాదుగాని అది నియంత్రించబడిన మహాశక్తి. దెబ్బకు దెబ్బ కొట్టి, తనపోరాట పటిమ ద్వారా పదిమందిని జయించడం హీరోయిజంగా చూపించే ఈ లోకంలో సాత్వికమనే ఆశీర్వాదం కోరుకునే వారెందరు? ఈ ఆశీర్వాదంలోనే మనుష్యుల మనసులను జయించే అద్భుత రహస్యం దాగివుంది. దేవుడనుగ్రహించిన పరిస్థితులను మౌనంగా అంగీకరించి దేవుని కొరకు ఓర్చుకునే శక్తి గొప్ప ఆశీర్వాదం. పగతీర్చుకోకుండా, క్షమించి, ఓర్చుకొనే ఈ శక్తిముందు కఠిన హృదయాలు కరిగిపోవలసిందే! సాత్వికులు క్రీస్తుప్రభువు కాడిక్రింద తమ మెడను వంచి ఆయన దగ్గరే నేర్చుకొంటారు. ఆయనలాంటి సాత్వీకుడెవరైనా ఉన్నారా? సాత్వికుడు చేతకాని వాడుకాదు, దేవుని కొరకు చేతకానివాని వలె సహించుకొంటాడు. ప్రపంచాన్ని ఇనుపదండంతో పరిపాలించిన రాజ్యములను వణికించిన రోమా సామ్రాజ్యం, సాత్వికులకు తలొగ్గకతప్పలేదు.

ఈ సాత్త్విక సమూహమే వెయ్యేండ్ల పరిపాలనలో ప్రపంచాన్ని ఏలుబడి చేస్తారు. ఆశబోతులు, కబ్జాకోరులు, అధికార దాహంతో గర్వంతో మీసాలు మెలేసే వారు, తొడలు చరిచి సవాలు చేసేవారు దేవుడు సాత్వికులకు ఈ భూమిని అప్పగించినప్పుడు వారు ఉనికిలో ఉండరు.

కామ, ధన దాహంతో నిండిన ఈ లోకములో నీతికొరకు ఆకలి దప్పులు కలిగియుండటం ఎంతభాగ్యం! ఎంత ఆశీర్వాదకరం! ఏ వాణిజ్య ప్రకటనలోనైనా, టివి కార్యక్రమాలలోనైనా కామవాంఛను ప్రేరేపించే దృశ్యాలే ఎక్కువ. ఆ ఆకలిని తీర్చడానికి ఎన్నో కేంద్రాలు రాత్రింబవళ్ళు పనిచేస్తున్నాయి. తిండిలేకపోయినా, టివి, సెల్‌ఫోన్ లేకపోతే బతకలేని ఈ సమాజానికి నీతిని గురించిన, పరిశుద్ధతను గూర్చిన శ్రద్ధ ఎలా వస్తుంది? నీతిగల పరిశుద్ధదేవుని కొరకైన తృష్ణ, ఆయన మార్గాలు, ఆయన చిత్తము కొరకైన ఆకలియున్న వారికి ఆయన తృప్తినిచ్చి వారి ఆకలి తీరుస్తాడు. ధనదాహం, ధనాశ గురించి వేరుగా చెప్పనవసరం లేదు. ఈ ఆకలి మానవులను చేయరాని కార్యాలను చేయుటకు త్వరపెడుతుంది. ధనాశ సమస్త కీడులకు మూలమని దైవవాక్యం ఘోషిస్తూనే ఉంది. కాని ఎన్ని అడ్డదారులైనా తొక్కి తమ ధనదాహం తీర్చుకోవడానికి పరుగులెత్తే సమాజంలో నీతికొరకు ఆకలి, దాహం కలిగిన వ్యక్తులు గొప్ప ఆశీర్వాదకారకులు. వారు చింతలేనివారు, శాంతిననుభవించువారు, ఉన్నదానితో తృప్తిచెంది సమాధానముతో నిద్రించువారు. తన ప్రియులు నిద్రించుచుండగ వారి ప్రభువు వారికిచ్చుచున్నాడు. మానవ జ్ఞానానికి అర్థంకాని దేవుని శాంతితో వారి తలంపులను (కీర్తనలు 127:2) ఆయన కాపుకాయుచున్నాడు (ఫిలిప్పీ4:7). వారికుడి పక్కను పదివేలమంది పడినను వారి ఎడమ ప్రక్కను వేయిమంది పడినను అపాయము రాకుండా తన దూతలను వారి చుట్టు కావలి ఉంచి రక్షిస్తాడు (కీర్తనలు 91:7; కీర్తనలు34:7). ఎంత గొప్ప ఆశీర్వాదము!

తప్పుచేసినవారిని రాళ్ళతో కొట్టి, మాటతో చీల్చివేసే ఈ సమాజంలో "కనికరము" దొరకని వస్తువు. దొరికినా కూడా అది నల్లబజారుల్లో అమ్మబడుతుంది. తన ప్రభువునుపోలి, కళ్ళనిండా, చేతులలో, మాటలలో

> శరీరాశ తీర్చుకోవడానికి లోక వ్యవస్థలో అనేక అవకాశాలు దొరుకుతాయి. శరీరం అలసిపోకూడదు, శ్రమకలగకూడదు, చేతులకు మురికి కాకూడదు, విశ్రాంతి సుఖభోగాలు అమలు జరపాలి - ఇవే లోకవ్యవస్థలోని కొన్ని సూత్రాలు. ఇవి జరగడానికి నీతిని, యధార్థతను, క్రమమును క్రమశిక్షణను, పరిశుద్ధతను విస్మరించమని లోకవ్యవస్థ బోధిస్తుంది, అనుకరిస్తుంది.

కనికరము చూపించి, తప్పుచేసిన వ్యక్తిని సమీపించి భుజముపై చెయ్యివేసి ప్రేమతో కళ్ళల్లోకి చూస్తూ ఆ వ్యక్తి కన్నీరు తుడవగల, ఆదరించే, ధైర్యపరచగల వ్యక్తులు ఎంత ఆశీర్వదించబడినవారో! వారి కరచాలనములో కనికరం ఉట్టిపడుతూ, అందరూ తనను దోషిగా చూస్తున్నప్పుడు కనికరంతో వారి పెదవులలోనుండి జాలువారే దయగల మాటలు ఎన్ని హృదయాలను ఆదరిస్తాయో! ఈ కదిలే ఆశీర్వాద దీపికలు మన సహవాసంలో కనమరుగైపోవడం మనపాలిట శాపం. మనలను కష్టపెట్టినవారిని క్షమించడం, మనకు కీడు చేసినవారికి మేలుచేయడం – లోకములో చదువు వలనగాని, తెలివితేటల వలనగాని వచ్చే విద్యకాదు. ఇది పరిశుద్ధాత్మ దేవుడు ఒక వ్యక్తి తననుతాను ఆయనకు అప్పగించుకున్నప్పుడు అతనికి అనుగ్రహించే గొప్ప ఆశీర్వాదం.

హృదయశుద్ధి అనునది పాపరహిత జీవితమని కాదు గాని యధార్థమైన, విశ్రమ రహిత జీవితం, బయట, లోపల ఒకే జీవితం. అంతరంగంలో ఖచ్చితమైన దృక్పథం, గురి, తీర్మానాలు గల జీవితం. లోకములో ఇలాంటి జీవితములు కనబడవు. బాహ్యంగా శుద్ధిగా, యధార్థంగా కనపడేవారు అనేకులు. కాని వారి జీవితాలు, కుటుంబాలు మేడిపండు పోలికే. క్రీస్తు ప్రభుని బోధనసారం యధార్థ జీవితం గురించే. ఈ జీవిత ప్రారంభం మారుమనస్సుతో మొదలు పెట్టి పరిశుద్ధాత్మ దేవుడు వారి మనస్సాక్షిని శుద్ధిచేసి, దేవునితో వారు తమ సహవాసాన్ని కొనసాగిస్తున్నప్పుడు వారిలో గొప్ప రూపాంతరాన్ని కలుగచేసి యధార్థతను వారి అంతరంగ బాహ్య జీవితాలలో కలుగజేయడమే ఈ గొప్ప ఆశీర్వాదము. ఇట్టివారుదేవుని స్వరూప దర్శనాన్ని

కలిగి ఉంటారు. దేవుని సత్యాన్ని అర్థంచేసుకొని పౌలు చెప్పినట్లు ఆయనను, ఆయన పునరుత్థాన బలాన్ని ఎరుగుటకు శాయశక్తుల ప్రయత్నిస్తారు. వారి జీవితాలు వారిలోని దేవుని ఇతరులకు చూపిస్తాయి. ఎంత అద్భుత ఆశీర్వాదం!

దేవుని కుమారుడు మానవున్ని దేవునితో సమాధానపరచి ఇరువురిని ఏకంచేశాడు. యూదులు, అన్యులు క్రీస్తు ప్రభుని సిలువ దగ్గర ఒక్క గుంపు అనగా సంఘముగా ఏకము చేయబడ్డారు. ఆయన మరణం మనుష్యులకు క్షమాపణ యొక్క అర్థాన్ని బోధించింది. ఆయన మరణం వలన దేవునితో సమాధాన పరచబడినవారు, సమాధానకారకుల ుగా మార్చబడి సమాజానికి, సంఘానికి గొప్ప ఆశీర్వాదంగా మారతారు. లోకములో, సమాజంలో విభజన, కలహము సామాన్య దృశ్యాలు. ఇవి విశ్వాస సంఘంలోనికి ఇయు, ఇజియఫ్‌లలోనికి, కుటుంబములలోనికి వ్యాపించాయి. స్వార్థం చనిపోతేనే ఇద్దరు శత్రువులు ఒక్కటై కలిసిపోతారు. ఇలా ఎవరు శత్రువులను కలుపగలరు? ఇలా ఎవరు ఇద్దరు శత్రువులకు నిజమైన క్షమాపణ గురించి వివరించగలరు? వారికోసం కన్నీరు కార్చి, ప్రార్థించి దేవుని శాంతిని, ప్రేమను వారి మధ్య ఎవరు ప్రవహింపచేయగలరు? చాలా కొద్దిమంది మాత్రమే ఈ గొప్ప ఆశీర్వాదం కలిగి ఉంటారు. వీరు ఎక్కడ ఉంటే అక్కడ సమాధానం రాజ్యమేలుతుంది. ఏకత్వం ఉంటుంది, విభేదాలు విడిపోతాయి. సంతోషం పరవళ్ళు తొక్కుతుంది. చేతులు, మనసులు కలుసుకొంటాయి. ఒకరినొకరు ఆలింగనం చేసుకొంటారు. అరుపులు, కేకలు పోయి సంతోషంతో కూడిన నవ్వులు వినిపిస్తాయి. శాపాలు దూషణలు పోయి, శుభసందేశాలు కృతజ్ఞతాభావాలు వెల్లివిరుస్తాయి. కుటుంబాలు ఏకత్వం అనుభవిస్తాయి. ఉద్యోగాలలో పనితనం పెరుగుతుంది. వ్యాపారా లలోలాభం అధికమవుతుంది. ఎందుకంటే ఆశీర్వాదము శాశ్వత జీవము అక్కడ ఉండాలని యెహోవా సెలవిచ్చియున్నాడు (కీర్తన 133:3).

శరీరాశ తీర్చుకోవడానికి లోక వ్యవస్థలో అనేక అవకాశాలు దొరుకుతాయి. శరీరం అల సిపోకూడదు, శ్రమ కలగకూడదు, చేతులకు మురి కికాకూడదు, విశ్రాంతి సుఖభోగాలు అమలు జరపాలి – ఇవే లోకవ్యవస్థలోని కొన్ని సూత్రాలు. ఇవి జరగడానికి నీతిని, యధార్థతను, క్రమమును, క్రమశిక్షణను, పరిశుద్ధతను విస్మరించమని లోకవ్యవస్థ బోధిస్తుంది, అనుకరిస్తుంది. కాని దేవుని రాజ్య సంబంధులు దేవుని నీతి నెరవేర్చడానికి, యధార్థత కలిగియుండడానికి హింస సహిస్తారు, శ్రమను లెక్కచేయరు,అపవాదులకు భయపడరు. ఈ హింస రాజకీయ, సామాజిక, మతపరమైన కారణాలకు కాదుగాని కేవలము దేవుని నీతికొరకైన కారణాలకు సంబంధించినది. వారు తాము నమ్మిన దేవుని నీతి, సత్యాల కొరకు ఉద్యోగాలలో పదోన్నతులు వదులుకొంటారు. అన్యాయంగా వచ్చే లాభాలకు చెయ్యిచాచరు. ఉద్యోగములో క్రమశిక్షణ మానరు. అబద్ధపు సర్టిఫికెట్స్, రసీదులు ఉపయోగించరు. ధనము అనే దేవతకు తలవంచరు. అవసరమైతే ప్రాణం ఇస్తారు. వారు దేవునివలన ఆశీర్వదించబడినవారు. వారి ఇంటినిండా దేవుని నీతి ప్రతిమూలలోను కన్పిస్తుంది. వారి బ్యాంకులలో పెద్దమొత్తాలు లేకపోయినా చిమ్మెటలు, తుప్పు తినివేయలేని, మరియు దొంగలు కన్నము వేయలేని చోట విస్తారముగా పెట్టుబడులు పెడతారు. వారి ఫలము రోజురోజుకు అధికమగుట తలచుకొని వారి హృదయము ఆనందంతో గంతులు వేస్తుంది (మత్త 5:12).

ఎప్పుడైనా ఈ ఎనిమిది ఆశీర్వాదాలను గూర్చిన ప్రస్తావన నీ ప్రార్థనలో వచ్చిన అనుభవం ఉందా? ఇవి ఆశీర్వాదాలనే గుర్తింపువుందా? ధన, ధాన్యాలు దేవుని కృపలు – అవి కొందరికి ఇవ్వబడతాయి, కొందరికి ఇవ్వబడవు. కాని దేవుని ఆశీర్వాదాలు షరతులతో కూడినవి. వాటిని ఆపేక్షించువారు తమ్ముతాము పరిశుద్ధాత్మ దేవునికి అప్పగించుకొని ఆయనద్వారా నడిపించబడుచున్నప్పుడు మాత్రమే వారికి లభ్యమౌతాయి. పిల్లలు USA లో సిద్ధపడడం, గొప్ప ఉద్యోగాలు సంపాదించుకోవడం, పెద్ద ఇల్లు కట్టించుకోవడం, కారు, బ్యాంక్ అకౌంట్స్ కలిగి ఉండడం ఆశీర్వాదాలుగా కొత్తనిబంధనలో ఎక్కడా చెప్పబడలేదు. దేవుడు ఆశీర్వాదం అనని వాటిని మనం ఎందుకు ఆశీర్వాదం అని చెప్పాలి? ఈ ధన్యతల్లో దాగి ఉన్న మౌళిక విలువలే మన దైనందిన జీవితాలకు దిక్సూచి కాగలదు.

**– కె. దేవిడ్ రాజ్‌కుమార్,** గుంటూరు




# పరుగుపందెం కన్నా ప్రభువు సన్నిధే మిన్న

**- ఎరిక్ లిడిల్**

స్కాట్‌లాండ్ దేశంలో క్రైస్తవులు ఆదివార దినాన్ని చాలా ఘనమైనదిగా చూస్తారు, ప్రభువును ఆరాధించడానికే కేటాయిస్తారు. ఆరోజున వారు ఏ పనీ చేయరు. ఏ క్రీడల్లో పాల్గొనరు. అత్యవసర సేవలు తప్ప మిగిలినవన్నీ ఆగిపోతాయి. ప్రభువును ప్రేమిస్తే ఆయన దినాన్ని కూడా ప్రేమిస్తాం అనేది వారి నమ్మకం. దీనికి కారణం ఎరిక్ లిడిల్.

స్కాట్‌లాండ్ అథ్లెట్, రగ్బీ ప్లేయర్, చైనా మిషనరీ అయిన ఎరిక్ హెన్రీ లిడిల్ ఈశాన్య చైనాలోని టెంట్‌సిన్ (ఇప్పుడు టియాంజిన్‌గా పిలుస్తున్నారు) అనే నగరంలో 1902 సం॥ జనవరి 16న జన్మించాడు. చైనాలో స్కాట్‌లాండ్ చర్చ్ తరుపున సేవచేసిన ఒక మిషనరీ దంపతులకు ఈయన జన్మించాడు.

ఎరిక్ 12సం॥ వయస్సు వరకు సర్రెలోని మిషనరీ పిల్లలకు ప్రత్యేకంగా ఉన్న ఎల్‌తామ్ కాలేజ్ బోర్డింగ్ స్కూల్లో విద్యను అభ్యసించాడు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎరిక్‌ను జ్ఞాపకం చేసుకున్నప్పుడెల్లా “అతను ఏ మాత్రం గర్వంలేని విద్యార్థి” అని చెప్పేవాడు. తర్వాత 1920సం॥లో ఎరిక్ ఎడిన్‌బర్గ్ విశ్వవిద్యాలయంలో చేరాడు. నిజానికి ఎరిక్ విశ్వవిద్యాలయంలో చేరేవరకు స్కాట్‌లాండ్‌లో కాలు పెట్టలేదు. ఎడిన్ బర్గ్‌లో తన అన్నయైన రాబ్‌తో కలసి బియస్సీలో చేరాడు. కానీ ప్రయోగశాలల్లో వస్తువులకన్నా అతని దృష్టి మిషనరీ సేవ, పరుగుపందెంపైనే ఉండేది. మొదట్లో ఓవల్ బాల్ ఆటద్వారా తన కెరీర్‌ను ప్రారంభించి 1921, 1923సం॥లలో ఏడు అంతర్జాతీయ బహుమానాలు అందుకొన్నాడు. తర్వాత పరుగుపందెము, ఓవల్ బాల్ రెండిటికి తగిన సమయం కేటాయించలేక పరుగుపందెంపైనే దృష్టిపెట్టాడు.

15సం॥ల వయసులో ఎరిక్‌లిడిల్ యేసుక్రీస్తును తన ప్రభువుగా, రక్షకునిగా అంగీకరించాడు. పోటీల్లో పరుగెత్తాలనేది అతని ఆశయమైనప్పటికీ ప్రభువే అతని మొదటి ప్రాధాన్యతగా ఉండేవాడు.

1924 సం॥ పారిస్‌లో సమ్మర్ ఒలింపిక్స్ జరుగుతున్నాయి. తన దేశం స్కాట్‌లాండ్ తరపున 100 మీటర్ల పరుగు పందెంలో ప్రాతినిధ్యం వహించడానికి వచ్చాడు. కానీ ఆ పోటీ ఆదివారం ఉందని ఒక సభ్యుడు చెప్పినప్పుడు దానిలో పాల్గొనడానికి అతడు ఒప్పుకొనలేదు. ఆరోజున పరుగుపందెంలో పాల్గొనడానికి నేను సిద్ధంగాలేను అని ఏకాంత ప్రాంతానికి వెళ్ళి కొంతసేపు ఒంటిరిగా

ప్రార్థించాడు. ప్రార్థనలో అతనికి తన నిర్ణయాన్ని గురించిన నిర్ధారణ కలిగింది. ప్రభువు దినాన్ని అగౌరవ పరచకూడదు అని భావించాడు. ఆ పోటీలో పాల్గొనడానికి బదులు పారిస్‌లోని స్కాట్స్ చర్చిలో ఆరాధనలో పాల్గొని, వాక్యోపదేశం చేయడానికి వెళ్ళాడు.

ఈ విషయం వెంటనే తోటివారికి, బ్రిటీష్ జట్టు మేనేజరుకు  తెలిసింది. "నీవు దేశాన్ని వంచించి నమ్మక ద్రోహం చెయ్యవద్దు" అని అరిచాడు. "నేను ప్రభువు దినాన్న పరుగెత్తలేను" అని ఎరిక్ మెల్లగా జవాబిచ్చాడు. అతను ఈ పోటీనుండి తప్పుకోవడం ముఖ్యాంశంగా మారింది. బ్రిటీషు క్రీడా అధికారులు కోపపడ్డారు. వార్తాపత్రికలు దీన్ని తీవ్రంగా ఖండించాయి. ఇంగ్లాండ్ రాజుకొరకు బంగారు పతకాన్ని గెలవడం కన్నా చర్చికి వెళ్ళడానికి ఎందుకు ప్రాధాన్యత ఇచ్చాడో తోటి ఇంగ్లాండ్ సభ్యులు అర్థంచేసుకోలేక సహకారం అందించడం మానేశారు.

తర్వాత ఎరిక్ బులెటిన్ బోర్డ్‌ను చదువుతున్నప్పుడు 400మీటర్ల పరుగు పందెం ఆదివారం లేకుండా ఉండడాన్ని గమనించాడు. కానీ అది అతడు పరుగెత్తగలిగిన దూరం కాదు. అయినా ప్రయత్నిద్దాం అనుకొని మేనేజరు వద్దకు వెళ్ళి ఈ పోటీలో నేను పాల్గొనడానికి అవకాశం ఏమైనా ఉందా? అని అడిగాడు. నిబంధనలకు విరుద్ధంగా మేనేజర్ అంగీకరించాడు. అందరి అంచనాలకు మించి మొదటి, రెండవ రౌండ్‌లో, సెమీ ఫైనల్స్‌లో గెలిచి ఫైనల్స్‌కు చేరుకున్నాడు. ఇది తన కెరీర్‌లో అత్యుత్తమమైన  ఘట్టము.

పోటీకి ముందు ఒక వ్యక్తి ఓ చిన్న కాగితాన్ని ఎరిక్ చేతికి అందించాడు. దానిలో "నన్ను ఘనపరచువారి ని నేను ఘనపరచెదను" అనే మాట ఉంది. అది 1 సమూయేలు 2:30. ఈ మాట ఎరిక్ చదివినప్పుడు ఎక్కడలేని శక్తి వచ్చింది.

400మీ పోటీ ఫైనల్స్‌రోజు ఎండ తీవ్రత భరించలేనంతగా ఉంది. ఎరిక్ పరుగెత్తవలసిన లైన్ సరిగా లేదు. ఈ రెండూ ప్రతికూలతలుగా ఉన్నాయి. వీటికన్నా అమెరికన్ బృందంలోని జాక్సన్ షుల్జ్ నుండి గట్టిపోటీ ఎదురైంది. అమెరికా దేశానికి చెందిన కోచ్ తన క్రీడాకారుల్ని ఉద్దేశిస్తూ వ్యంగ్యంగా 'ఈ స్కాట్ గురించి మీరేమి కంగారు పడకండి. 200మీటర్లు పరుగెత్తే సరికి అతని పనైపోతుంది' అని చెప్పాడు. ఈ మాటల వల్ల ఎరిక్ మరింత జాగ్రత్తలు తీసుకొన్నాడు.

తన ప్రత్యర్థులందరితో కరచాలనం చేశాడు. పరుగుపందెం ప్రారంభమైంది. ఈ 'ఫ్లైయింగ్ స్కాటిష్‌మాన్' దూసుకుపోయాడు. చిరుతలా పరుగెత్తిన లిడిల్ ఆరుమీటర్ల తేడాతో తన ప్రత్యర్థుల్ని ఓడించి బంగారు పతకాన్ని సాధించడమే కాదు, 47.6తో ప్రపంచ రికార్డు సృష్టించాడు. అతను విజయం సాధించడానికి కారణాన్ని అతనిమాటల్లో వింటే బాగుంటుంది: "నేను మొదటి 200మీటర్లు నా స్వంత శక్తితో పరుగెత్తాను. మిగతా 200మీటర్లు దేవుని సహాయంతో పరుగెత్తాను. ఇదే నా విజయ రహస్యం."

అతని జీవిత చరిత్రను రాసిన వారిలో ఒకతను ఇలా చెప్పాడు: "క్రైస్తవ విశ్వాస సూత్రం అతనికి ముఖ్యం గనుక 100 మీటర్ల పందెంలో బంగారు పతకాన్ని గెలుచుకొనే అవకాశాన్ని వదిలేసి లక్ష లాదిమంది ప్రజల ఊహలను తారుమారు చేశాడు. దానికి బదులు 400మీటర్ల పందెంలో అనుకోకుండా గెలిచినప్పుడు దేశం అతని పాదాల వద్ద ఉంది".

అతను పాల్గొని గెలిచిన అనేక పరుగు పందెముల కన్నా, అతను పాల్గొనకుండా మానుకున్న ఒక్క పరుగుపందెమును బట్టి స్కాట్‌లాండ్ దేశస్థుడైన ఎరి క్ లిడిల్ ఎంతో పేరు ప్రఖ్యాతులు సంపాదించాడు. అతని జీవితాన్ని ఆధారం చేసుకొని తీసిన  'ఛారి యట్స్ ఆఫ్ ఫైర్' అను చిత్రంలో చెప్పినట్లు 'తాను జీవించిన జీవితాన్ని బట్టి స్కాట్‌లాండ్ దేశంనుండి వచ్చిన గొప్పవారందరిలో ఒకనిగా పేరు తెచ్చుకొన్నాడు.

ఒలింపిక్ క్రీడలు ముగిసినవెంటనే ఎరిక్ లిడిల్ తన దృష్టిని మిషనరీ సేవపై పెట్టాడు. 1925సం॥లో అతను చైనాకు మరలా వచ్చాడు. 1932లో టెంట్‌సిన్ నగరంలో ఒక సేవకునిగా అభిషేకంపొంది సేవ మొదలుపెట్టాడు. రెండు సం॥ల తర్వాత ఫ్లోరెన్స్ మెకంజీని వివాహం చేసుకున్నాడు. వీరికి ముగ్గురు కుమార్తెలు జన్మించారు. 1937లో జపాన్ చైనాపై దాడిచేయడం మూలంగా వీరు ఆక్రమిత ప్రదేశమైన సియాచింగ్‌కు వెళ్ళారు. 1941లో చైనాలో ఉన్న బ్రిటీష్ జాతీయులందరూ చైనాను వదిలివెళ్ళడం



మంచిదని బ్రిటీష్ ప్రభుత్వం ఆదేశాలు జారీచేసింది. ఎరిక్ కుటుంబ సభ్యులందరూ కెనడాకు వెళ్ళారు. ఎరిక్ ఒక్కడే చైనాలో ఉన్నాడు. 1943సం॥లో జపాన్ ప్రభుత్వం ఎరిక్‌ను అరెస్ట్‌చేసి వెయిషీన్ క్యాంప్ చెరసాలలో ఉంచారు. జైల్లో అతను ఎంతో దుర్భరమైన జీవితాన్ని గడిపినా క్రీస్తు ప్రతిబింబంగా జీవించాడు. తన తోటి ఖైదీలలోని కొందరు ముఖ్యంగా ఆయిల్ కంపెనీ ఉద్యోగులు జైలు అధికారులకు లంచం ఇచ్చి సుఖభోగాలు అనుభవించేవారు. అతడు బలహీనులకోసం బొగ్గును మోసేవాడు. "నా దగ్గర ఏమీ ఆశించకుండా నాకు సహాయపడిన మొదటి వ్యక్తి ఎరిక్"అని ఖైదీలలో ఒకరైన రష్యావేశ్య ఎరిక్ గురించి సాక్ష్యమిచ్చింది. అలా క్రీస్తు కొరకు జీవిస్తూ 1945 ఫిబ్రవరి 21వ తేదీన బ్రెయిన్ ట్యూమర్ వల్ల చనిపోయాడు.

**ఎరిక్ లిడిల్ కొటేషన్స్**

"ఒక వ్యక్తి ఒక పనిలో తన శాయశక్తులా కృషిచేసినప్పుడు, అది విజయవంతమైనా, విఫల మైనాసరే, దానిలో అతనికి గొప్ప సంతృప్తి దొరుకుతుంది".

"నేను వేగంగా పరుగెత్తే శక్తి దేవుడు నాకు ఇచ్చాడు. నేను పరుగెత్తుతున్నప్పుడు ఆయన ఇచ్చే సంతోషాన్ని అనుభవిస్తుంటాను".

"మనం అందరం మిషనరీలమే. మనం అడుగుపెట్టిన ప్రతిచోట క్రీస్తు దగ్గరకు ప్రజల్ని తీసుకురావడంగాని, లేదా ప్రజలు క్రీస్తుకు దూరంగా వెళ్ళడంగాని, ఈ రెండిట్లో ఏదో ఒకటి చేస్తూనే ఉంటాము".

"నీవు దేవునిని ఎంతవరకు తెలుసుకోవాలని కోరుకొంటావో అంతవరకే తెలుసుకోగలుగుతావు".

"ఒక ఉద్దేశంతో దేవుడు నన్ను సృష్టించాడని నేను నమ్ముతున్నాను. అదే పరుగెత్తడం. నేను పరుగెత్తే ప్రతిసారి నేను దేవుని సంతోషాన్ని అనుభవిస్తుంటాను".

"క్రీస్తు లోకానికి వచ్చాడు, ఎందుకంటే ఆయన లోకానికి అవసరం కాబట్టి".


"మనలో చాలామంది జీవితంలో శ్రేష్ఠమైనదాన్ని కోల్పోతున్నారు. కారణం ఏంటంటే మొదటి ప్రాధాన్యత ఇవ్వాల్సిన విషయాల్ని వదిలేసి, రెండవ ప్రాధాన్యత విషయాల కొరకు పరుగెడుతున్నారు".

"పవిత్రత అంటే సహజ ప్రవృత్తిని అణచివేయడం కాదు. ఈ సహజ ప్రవృత్తిని ఆత్మ ఆధీనంలో ఉంచడమే పవిత్రత".

"పరిశుద్ధుడునూ, నిత్యుడునూ, ప్రేమామయుడు, సర్వశక్తిమంతుడైన తండ్రియైన దేవునిని నేను నమ్ముచున్నాను. ఆయనకు లోకము పట్ల ఒక ప్రణాళిక ఉన్నది. అలాగే నా జీవితం పట్ల కూడా ఆయనకు ఒక ప్రణాళిక ఉంది. నేను అనుదినం ఏమి చేయాలనేది కూడా ఆయన ప్రణాళికలో ఉన్నది. కుమారుడైన క్రీస్తును నేను నమ్ముతున్నాను. ఆయన నాకు రక్షకుడు, దేవుడు, ప్రభువు, నాకు మాదిరి. పరిశుద్ధాత్మ దేవున్ని నేను నమ్ముతున్నాను. నేను దేవుని చిత్తానిని తెలు సుకొనేటట్లు ఆయన నన్ను నడిపిస్తాడు. ఆయన ఆధీనములో, నడిపింపులో నా జీవితాన్ని ఉంచడానికి నేను సిద్ధపడి ఉన్నాను. నా పూర్ణహృదముతోను, నా పూర్ణ మనసుతోను, నా పూర్ణబలముతోను దేవుని ధర్మశాస్త్రాన్ని నేను ప్రేమిస్తున్నాను. మనుష్యుల మధ్య బంధాలను, స్నేహాలను, సహవాసాలను చెడగొడుతున్న కుల, మత, జాతి, వర్ణ బేధాలు లేకుండా ఈ ప్రపంచం శాంతికరంగా ఉండాలనేది దేవుని చిత్తమని నేను నమ్ముచున్నాను. విశ్వాసముంచడం అంటే మన:పూర్వకంగా, హృదయపూర్వకంగా ఈ విషయాలను నమ్మి, ఆ ప్రకారం నడుచుకోవడం".

"ఒలింపిక్స్ క్రీడలు ముగించుకొని బంగారు పతకంతో స్వదేశానికి రావడం ఒక గొప్ప అనుభూతి. కాని నా యౌవనప్రాయంనుండి నేను మరొక బహుమానంపై దృష్టిపెట్టాను. పారిస్‌లో నేను పరుగెత్తిన పరుగుపందెములన్నిటికన్నా గొప్ప పరుగుపందెములో మనమందరమూ ఉన్నాము. దేవుడు మనకు తగిన పతకాలు ఇచ్చేంతవరకూ ఆ పరుగు పందెము కొనసాగుతూనే ఉంటుంది".

**– పి. సునీల్ జాకబ్,** ఎడిటర్



# ప్రేమ

## కష్టపడుతుంది, ఖర్చు పెడుతుంది

ఫిబ్రవరి 14 అనగానే 143తో కుర్రకారు గుండెలు పరుగులెత్తుతాయి. పార్క్‌లు, షాపింగ్ మాల్స్, సినిమా హాల్స్, మల్టీప్లెక్స్‌లు, పబ్‌లు, క్లబ్‌లు, బీచ్‌లు, నదులు, వాగులు, వంకలు, రోడ్లు... ఇలా ఎక్కడపడితే అక్కడ, ఎక్కడ కుదిరితే అక్కడ తమ ప్రేమను వ్యక్తపరచడానికి తాపత్రయపడుతుంటారు. ఈ మధ్య కాలంలో బైక్ మీద కూర్చొని, బైక్‌ను నడుపుకుంటూ నడిరోడ్డు మీద సిగ్గును పక్కనపెట్టి ప్రేమించుకుంటున్నారు. ఈ రోజున తమ స్తోమతను, స్థాయిని మించి ఖర్చు పెట్టడానికి, కష్టపడడానికి ఎంత దూరమైన వెళ్తారు, ఏదైనా చేస్తారు. ఏదో మత్తు ఆవహించినట్లు గమ్మత్తుగా ప్రవర్తిస్తారు. ప్రపంచవ్యాప్తంగా ఈ రోజున కొన్ని వందల కోట్ల రూపాయలు ఖర్చు పెట్టడానికి చాలా స్పెషల్‌గా ప్లాన్ చేసుకొంటారు.

ఫిబ్రవరి 14న అర్థమయ్యే విషయమేంటంటే, "యువత ప్రేమించడానికి, ప్రేమించబడటానికి కష్టపడతారు, ఖర్చు పెడతారు". నన్ను కూడా ప్రేమించేవారున్నారు అని చెప్పుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. 143 బండి ఎక్కిన వారు కాలం గడిచేకొద్దీ 108 బండి ఎక్కడానికి సిద్ధపడుతుంటారు.

మనం చూస్తున్న ఈ ప్రేమలు నిజమైనవేనా? కొంతమంది మా ప్రేమ నిజమైనది అనే భ్రమలో బతుకుతుంటే, మరికొందరు ప్రేమ దక్కకపోతే చంపేస్తున్నారు లేదా చచ్చిపోతున్నారు.

అసలైన ప్రేమ అర్థం తెలియక నకిలీ ప్రేమతో నష్టపోతున్న ఈ తరానికి నిజమైన ప్రేమను చూపించాల్సిన బాధ్యత మనందరి మీద ఉంది. ప్రేమనేది కేవలం భావోద్రేకాలుకాదు, కార్యాలని 1 కొరింథీ 13లో చూస్తే మనకు అర్థమవుతుంది. దేవుడు ప్రేమాస్వరూపి, ప్రేమకు మూలం ఆయనే (1 యోహాను 4:8,16). ఒక వ్యక్తికి దేవునితో సంబంధం, సహవాసం ఉంటేనే నిజమైన ప్రేమ ఏంటో అర్థమై, ఆచరణలో చూపించడానికి వీలవుతుంది. విశ్వాసులంగా మనమందరము ఈప్రేమను అనుభవించాము, అనుభవిస్తున్నాము కనుక అందించాల్సిందే.

సహజముగా పార్క్‌ల దగ్గర, షాపింగ్ మాల్స్ దగ్గర, బీచ్‌ల దగ్గర కన్పించే ప్రేమ జంటలను చూసినప్పుడు మనకెంతో చిరాకుగా ఉండి కోపం వస్తుంది. మనకి చాలాసార్లు పాపంలో ఉన్నవారిని చూస్తే ఎక్కడలేని పరిశుద్ధత గుర్తుకు వచ్చి మనకు తెలియకుండానే వారి పట్ల ఒకరకమైన అసహ్యం మన అంతరంగంలో ఉంటుంది.

అందుకనే చాలాసార్లు వాళ్ళని చూడగానే నశించిపోతున్నారనే వేదన ఉండక, నాశనమైపోవాలి అనుకుంటాము. గతంలో మనలను ఎలాంటి పరిస్థితుల్లోనుండి దేవుడు రక్షించాడో జ్ఞాపకం చేసుకొంటే కన్నులు తెరుచుకుంటాయి. నకిలీ ప్రేమతో తమజీవితాల్ని నాశనం చేసుకొంటున్న వారి కోసం భారంగా ప్రార్థిస్తాము. నిజ ప్రేమకు మూలమైన యేసుక్రీస్తును వారికి పరిచయం చేస్తాము. నిజమైన ప్రేమ తెలియని యువతరానికి, నిజమైన ప్రేమ చూపించాలంటే...

### 1. కనికరం చూపేవారు కావాలి: మత్తయి 9:36

ఆయన జనసమూహములను చూచి వారు కాపరి

లేని గొఱ్ఱెల వలె విసికి చెదరియున్నందున వారి మీద కనికరపడి...

మన కన్నులకు కనికరం అవసరం. పాపంలో పట్టబడిన స్త్రీని యేసుప్రభువు చూసినట్లుగా, దేవునిని ఎరుగక పాపంలో ప్రేమ పేరుతో మగ్గి పోతూ, జీవితాలను బుగ్గి చేసుకొంటున్న యువతను కనికరంతో చూసే కన్నులు కావాలి.

## 2. అంగీకరించేవారు కావాలి: మత్తయి 9:10

ఇంటిలో భోజనమునకు యేసు కూర్చుండి యుండగా... ఇదిగో సుంకరులును పాపులును అనేకులు ఆయన యొద్దకు వచ్చి కూర్చుండిరి.

మనం చాలాసార్లు యువత డ్రెస్, హెయిర్ స్టైల్, వాళ్ళ సంబంధాలు, సహవాసాలను చూసి... మన దగ్గరికి రానివ్వము.

ఇక్కడ వారితో కలసిపొమ్మని కాదు గాని వారి ని మనతో కలువనిద్దాము, మనతో కూర్చోనిద్దాము, మనతో కలసి తిననిద్దాము. మనకు అర్థం కావాల్సింది వారి పాపమును అంగీకరించమని కాదు గాని వారి ని అంగీకరించమని. ప్రభువైన యేసుక్రీస్తు వారు పాపుల స్నేహితుడుగా పిలువబడి, నాలో పాపం ఉన్నదని నిరూపించగలరా అంటూ సవాలు చేశాడు. అందుకని వారు ఏ స్థితిలో ఉన్నారో ఆ స్థితిని అంగీకరించకపోతే – నిజమైన ప్రేమను అందించలేము, చూపించలేము.

## 3. ప్రార్థించేవారు కావాలి: మత్తయి 9:38

తన కోతకు పని వారిని పంపమని కోత యజమానుని వేడుకొనుడి అని తన శిష్యులకు చెప్పెను.

నశించిపోతున్న యువతకు, ప్రేమ మత్తులో మునిగి నాశనం వైపు పరుగెడుతున్న నవతరానికి ఆయన ప్రేమను అందించేవారి కోసం, చూపించే వారి కోసం 'పనివారు' కావాలి అని ప్రార్థించేవారు కావాలి. వారి పాప స్థితిని బట్టి కోపగించుకొనక, వారి కోసం ప్రార్థించేవారు కావాలి.

## 4. ప్రేమను చూపించేవారు కావాలి: యోహాను 4:39

... సాక్ష్యమిచ్చిన స్త్రీ యొక్క మాటను బట్టి ఆ ఊరిలోని సమరయులలో అనేకులు ఆయనయందు విశ్వాసము ఉంచారు.

మనం దేవుని దగ్గర నుండి ఏ ప్రేమను అయితే పొందామో ఆ ప్రేమను చూపించబద్ధులమై ఉన్నాము. మాటలు బాగున్నాయి కాని క్రియలలో కన్పించకపోతే, చేతులలో ఉన్న దేవుని వాక్యం చేతలలోనికి రాకపోతే, ప్రేమను చూపించక ప్రేమ గురించి ఎంత చెప్పినా అదంతా వృధా ప్రయాసనే అవుతుంది.

## 5. ప్రకటించేవారు కావాలి: రోమా 10:14

ఈ తరానికి అర్థవంతమైన రీతిలో ఆయన ప్రేమను ప్రకటించేవారు కావాలి. దాని కోసం మనల్ని మనం అప్‌డేట్ చేసుకోవాలి. మెళకువలు నేర్చుకోవాలి. వారికి తగినట్లుగా వాక్యపు సత్యాల ను వాక్యపు విలువలను మీరకుండా ప్రకటించేవారు తయారుకావాలి.

## 6. ప్రయాసడేవారు కావాలి: అ.కా. 20:24

... దేవుని కృపా సువార్తను గూర్చి సాక్ష్యమిచ్చుట యందు నా పరుగును, నేను ప్రభువైన యేసు వలన పొందిన పరిచర్యను తుద ముట్టింపవలెనని నా ప్రాణమును నాకెంత మాత్రమును ప్రియమైనదిగా ఎంచుకొనుట లేదు.

మన సుఖ వలయాల్ని దాటుకొని రాలేకపోతే, ప్రాణమును కష్టపెట్టడానికి ఇష్టపడకపోతే ప్రేమను పంచలేము.

"ప్రాణమును ప్రియముగా ఎంచుకొన్నవారు ఆయన ప్రేమను పంచలేరు, చూపించలేరు".

మన పరిచర్యకు ప్రయాస జత అవ్వాల్సిందే.

ప్రేమ అనేది దేవుని పట్ల, సహోదరుల పట్ల, పొరుగు వాని పట్ల మాత్రమే కాదు అది శత్రువుల వరకు వెళ్ళాల్సిందే. శత్రువులను ప్రేమించుడి అనే మాట మన జీవితాలలో కన్పించాల్సిందే. ప్రేమ ప్రాణం పెడుతుంది అనేది బైబిల్ చెప్తున్న సత్యం. శత్రువుల కోసం ప్రాణం పెట్టాల్సినంతగా ఎదగటం అనేది దేవుని ఆశ. శత్రువులకు సైతం ఆ ప్రేమను చూపించబద్ధులము.

నశించిపోతున్న వ్యక్తుల పట్ల దేవుని ప్రేమను చూపించే క్రమంలో మన ప్రేమలో ఖర్చు ఉండాల్సిందే, కష్టం ఉండాల్సిందే...

– యం. గాలెయ్య, భీమవరం

(ఇవాంజలిజం అండ్ టెస్టిమొని డిపార్ట్‌మెంట్ తరుపున)

కథానిక



# వెలుగిచ్చే దీపాలు

క్షణక్షణానికీ ఎక్కువవుతున్న వర్షాన్ని దాటుకొని హాస్టల్ని సమీపించాడు నిరీక్షణ్. గోడపక్కన బైక్ పార్క్ చేసి హాస్టల్లోపలికి నడిచి, వర్షానికి తడవకుండా వేసుకున్న రెయిన్ కోట్ తీసి గోడకున్న మేకుకి తగిలించి ముందుకు నడిచాడు. నిరీక్షణ్‌కి నలభై ఏళ్ళుంటాయి. పేరున్న కాలేజ్‌లో లెక్చరరుగా పనిచేస్తున్నాడు. చదువుకొనేటప్పుడు ఒక అన్న ద్వారా యేసుప్రభువును సొంత రక్షకుడిగా అంగీకరించి బాప్తీస్మం తీసుకొన్నాడు. ఎక్కడ, ఎప్పుడు, ఎలాంటి అవకాశం వచ్చినా వదులుకోకుండా సువార్తను ప్రకటించడం అలవాటు చేసుకొన్నాడు. వాక్యం దీపమని నమ్ముతాడు. ఆ దీపమే లోకానికి వెలుగి స్తుందని విశ్వసిస్తాడు. ప్రత్యేకించి విద్యార్థి జీవితంలో దేవునిని సొంతరక్షకునిగా అంగీకరిస్తే మనసు ఎంత సమాధానంగా ఉంటుందో అనుభవపూర్వకంగా తెల ుసుకొన్నాడు కాబట్టి విద్యార్థుల ద్వారా వాక్యం దీపంగా మారి ప్రభావవంతంగా లోకానికి వెలుగిస్తుందని నమ్మాడు. అందుకే ప్రతీ శుక్రవారం సాయంత్రం ఎన్ని పనులున్నా ఆ హాస్టలుకి తప్పనిసరిగా వచ్చి పిల్లలను ఒకచోట చేర్చి దేవుని గూర్చి చెప్తుంటాడు. ముందుకు నడుస్తున్న నిరీక్షణ్ మెట్లమీద కూర్చుని సెల్ చూస్తున్న రాఘవను చూసి ఆగిపోయాడు. అతనికి దగ్గరగా వెళ్లి "తమ్ముడూ... బాగున్నావా?" అన్నాడు.

"ఊ..." అన్నాడు రాఘవ.

"కాలేజ్‌కి వెళ్తున్నావా?"అడిగాడు నిరీక్షణ్.

"ఊ..." అన్నాడు రాఘవ.

"బైబిల్ స్టడీకి రావట్లేదు. ఏమైనా పనులు న్నాయా?" మళ్ళీ అడిగాడు నిరీక్షణ్.

రాఘవలో అసహనం ఛాయలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. అయినా విసుగును లోలోపలే దాచుకుంటూ "ఊ.." అన్నాడు ముక్తసరిగా.

"సంక్రాంతి సెలవుల్లో నువ్వు డిటి క్యాంప్‌కు వెళ్ళావు కదా!" అన్నాడు నిరీక్షణ్.

"ఊ.." అన్నాడు రాఘవ.

"సరే తమ్ముడూ... ఏదో పనిలో ఉన్నట్లున్నావు. మళ్ళీ కలుస్తానులే. వీలుచూసుకొని బైబిల్ స్టడీకి వస్తూ ఉండు, మానకు. డిటిలో నేర్చుకొన్నవి మనమం చేసుకోకపోతే లోకంలో పడిపోతాం.." అని చెప్పి ముందుకు కదిలాడు. గేట్‌లో నుండి లోపలికెళ్ళి కుడిచేతి పక్కకు తిరిగితే మూడుగదుల అవతల తను రెగ్యులర్‌గా బైబిల్‌స్టడీ తీసుకునే రూమ్ వస్తుంది. పిల్లలంతా టవల్ చుట్టుకుని, షార్ట్‌లు వేసుకొని ఎవరికి తోచినట్టు వాళ్లు కాపరిలేని గొర్రెల్లాగా

తిరుగుతున్నారు. పైకి వెళ్లే మెట్లమీదా, గోడల మీదా ఎక్కడపడితే అక్కడ కూర్చొని సెల్‌ఫోన్‌ల్లో బందీలైపోయారు. కొంతమంది ఏవో సినిమాపాటలు పాడుకొంటూ, మరికొంతమంది నోటికి వచ్చిన భాషల్లా వాడుతూ పెద్దగా నవ్వుకొంటున్నారు. అది హాస్టల్‌లో, పిచ్చాసుపత్రో అర్థంకాలేదు ఒక్కక్షణం. అక్కడైతే మతిలేక తిరుగుతారు, ఇక్కడేమో మతు లున్నా మైమరచి తిరుగుతుంటారు. అంతే తేడా!

తల్లీదండ్రీ దగ్గరుండరు. కార్పోరేట్ కాలేజ్‌ల్లో చదివించలేక, తాము పడుతున్న కష్టం తమ పిల్లలు పడకూడదని దూరమైనా పిల్లల్ని హాస్టల్లో ఉంచి చదివిస్తుంటారు తల్లిదండ్రులు. వచ్చిన కొత్తలో భయంభయంగానో, బెరుగ్గానో అమాయకంగా ఉన్న పిల్లలంతా సీనియర్ విద్యార్థులతో స్నేహంచేసి రెండుమూడు నెలలకే దారితప్పుతుంటారు. అందరూ వివిధ రకాల కోర్సులు చదువుతూ టీనేజ్‌లో ఉన్నవాళ్ళే. ఉడుకురక్తం... మరిగేరక్తం. మనసుల్ని కలుషితం చేస్తూ మనుషుల్ని ఏ పనికైనా పురికొల్ప డానికి అవకాశం ఉన్న వయస్సు వాళ్ళది. చేతిలో డబ్బులుంటే ఖర్చుపెట్టడం, లేకపోతే ఎవరి దగ్గర డబ్బుంటే వాళ్ళతో చేరిపోయి వాళ్ళు చెప్పిన పనులన్నీ చేయడం, సిగరెట్లు, అప్పుడప్పుడూ మందు, సినిమాలు, పిచ్చిపట్టినట్లుగా వ్యసనంగా మారి పోయిన పబ్జీలాంటి గేమ్‌లు. తమను లాక్కెళ్లే పనుల్లో తప్ప వాళ్ల మనసును నిలకడగా ఉంచుకోవాలనే ఆలోచనే రాదు వాళ్ళకి. ప్రతీ శుక్రవారం ఇలాంటి దృశ్యాలు, ఆలోచనలు నిరీక్షణ్ మనసులో మెదులు తుంటాయి. తనకు అవకాశం ఉన్నంతవరకూ అక్కడ చేరిన పిల్లలకు దేవుని ప్రేమపట్ల ఆసక్తి కలిగేలా చెప్పి వాళ్లను దేవుని వైపు తిప్పడానికి ప్రయత్నిస్తుంటాడు.

> **“ఎందుకు సార్... మంచి ఉద్యోగం చేస్తున్నారు. వచ్చే జీతాన్ని వాడుకొంటూ భార్యాపిల్లలతో జీవితాన్ని అనుభవించకుండా ఇంత వర్షంలో ఈ వెధవల కోసం ఇంత ప్రయాసపడి వస్తారు. వాళ్లు రారు, వచ్చినా వినరు. మీ ప్రయాస వ్యర్థం కదా...” అన్నాడు తన సహజ ధోరణిలో.**

“మాస్టారూ... నమస్తే!” అని వినిపించడంతో ఆలోచనలకు కళ్ళెంవేసి ఆగిపోయాడు నిరీక్షణ్. హాస్టల్ వార్డెన్ నవ్వుతూ కనిపించాడు. ఎన్ని ఒత్తిడులున్నా పెదాలపై పూసిన చిరునవ్వును చెరగనీయకపోవడం దేవుడిచ్చిన వరం. వార్డెన్‌ని చూసినప్పుడల్లా నిరీక్షణ్‌కి ఆ అభిప్రాయం కలు గుతుంటుంది. నమస్కారం చెప్పి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు నిరీక్షణ్. “బైబిలుస్టడీకి వచ్చారా మాస్టారూ...?” అన్నాడు నవ్వుతూ వార్డెన్. అవునన్నట్లుగా తలూపాడు నిరీక్షణ్.

“ఎందుకు సార్... మంచి ఉద్యోగం చేస్తున్నారు. వచ్చే జీతాన్ని వాడుకొంటూ భార్యాపిల్లలతో జీవితాన్ని అనుభవించకుండా ఇంత వర్షంలో ఈ వెధవల కోసం ఇంత ప్రయాసపడి వస్తారు. వాళ్ళు రారు, వచ్చినా వినరు. మీ ప్రయాస వ్యర్థం కదా...” అన్నాడు తన సహజ ధోరణిలో.

“అన్నీ తెలిసినవారు మీరే అలాగంటే ఎలా సర్”? వాకిట్లో నాటిన మొక్కను మనమే జాగ్రత్తగా కాపాడుకోవాలి. ఎండనుండీ వాననుండీ రక్షించుకోవాలి. నిటారుగా నిలబడడానికి దానికి కావలసిన సపోర్ట్ ఇవ్వగలగాలి. మొక్కను నాటి అలాగే వదిలేసి దానంతటదే పెరుగుతుందని అనుకోకూడదు కదా! కొంత ఎదిగే వరకైనా మనం ఇవ్వాల్సిసిన చేయూత అన్ని విధాలుగా అందించాలి. అప్పుడే అది నిలబడుతుంది, నలుగురికి ఉపయోగపడుతుంది. ఈ పిల్లలు కూడా అంతేసార్! అంధకారంలో ఉన్నారు, అయోమయంలో ఉన్నారు. ఏది మంచో, ఏది చెడో గ్రహించలేని గుడ్డితనంలో ఉన్నారు. వాళ్ళను చేరదీసి వాళ్ళ కోసం ప్రాణం పెట్టిన దేవుని పరిచయం చేస్తే ఒక్కసారిగా కాకపోయినా తర్వాతైనా తాను వెలుగుతాడు, పదిమందికి వెలుగు చూపిస్తాడు. ఎప్పుడైనా వెలుగుతున్న దీపమే పది దీపాలను వెలిగి ంచడానికి ఉపయోగపడుతుంది కదా సార్...” చెప్పి నవ్వుతూ బయటికి వచ్చేశాడు.

నిరీక్షణ్ రాకను గమనించిన కొంతమంది పిల్లలు చాపలు పరిచి, వాళ్ల దగ్గరున్న బైబిల్స్ తెచ్చుకొని కూర్చున్నారు. లెక్కకు పదిమంది కనిపించారు. ఇందులో వెలిగేదెవరో! తొలిగేదెవరో! నిలబడేదెవరో? పడిపోయేదెవరో? ఏదేమైనా సరే... విశ్వాసంతో ప్రార్థన చేయాలి. వీరందర్నీ దేవుడికోసం నిలబడే

మంచి సైనికుల్లా, ఆరిపోని దీపాల్లా తయారుచేయాలి అనుకున్నాడు నిరీక్షణ్. ప్రారంభ ప్రార్థన చేసి కొద్దిసేపు పాటలు పాడించాడు. కాపరిలేని గొర్రెలు ఎంతగా దారితప్పుతాయో చెప్పి నిజమైన కాపరి యేసుక్రీస్తును కలిగివుంటే జీవితం ఎంతగా వెలిగించబడుతుందో వివరించాడు. లోకస్నేహాలు వ్యర్థమనీ, దేవునిని నిజమైన స్నేహితుడిగా కలిగివుంటే ఎన్ని లాభాలుంటాయో విశదపర్చాడు. వ్యక్తిగతంగా ఒక్కొక్కరితో మాట్లాడి వాళ్ళ సమస్యలు తెలుసుకొన్నాడు, వాళ్ళ అవసరాలు గుర్తించాడు. ప్రతీ అవసరానికి ముందు దేవునిపై ఆధారపడాలనీ, ఆ తర్వాతే మనుషుల వైపు చూడాలని ప్రేమగా చెప్పాడు. చివరి ప్రార్థన చేసి ఇంటికి బయల్దేరాడు నిరీక్షణ్.

*****

శనివారం ఉదయం క్లాస్‌కు బయల్దేరబోతుండగా ఫోన్ మోగింది. స్క్రీన్ మీద రాఘవ పేరు కనిపించడంతో లిఫ్టుచేసి 'హలో రాఘవా ఎలా ఉన్నావు?' అన్నాడు నిరీక్షణ్. "సార్ నేను రాఘవని కాదు... వీరబాబుని మాట్లాడుతున్నాను. రాఘవకి ఒంట్లో బాగుండకపోతే రాత్రి గవర్నమెంట్ ఆస్పత్రికి తీసుకొచ్చాము. ప్రార్థన చేస్తారని ఫోన్ చేశాను సార్..." అన్నాడు. రాఘవకి ఏమయిందోనన్న ఆందోళన చుట్టుముట్టింది ఒక్కసారిగా. "అయ్యో... అవునా! రాత్రి చెప్తే వెంటనే వచ్చేవాడిని కదా. ఇప్పుడెలా ఉంది" అన్నాడు కంగారుగా. "ఆ టైమ్‌లో చేస్తే బాగుండదని చేయలేదు... ఇప్పుడు పర్వాలేదు సార్.. బాగానే ఉన్నాడు" అన్నాడు వీరబాబు. ఫోన్ పెట్టేసి బైక్‌ని వేగంగా అస్పత్రి వైపు పోనిచ్చాడు. బెడ్ మీద పడుకొన్న రాఘవని చూడగానే కళ్లల్లో నీళ్ళు తిరిగాయి. రాఘవకు అలా ఎందుకు జరిగిందో పిల్లలు వాళ్ళకు తెలిసిన కారణాలు వాళ్ళు చెప్పారు. అన్నీ విన్న తర్వాత అసలు విషయం తెలుసుకోవాలని డాక్టర్ని కలిశాడు.

"ఆ అబ్బాయి మీకేమవుతాడో తెలియదు. సమయానికి ఆహారమూ, నిద్ర ఎంత అవసరమో మీకు తెలియనిది కాదు. ఈ అబ్బాయికి సెల్‌ఫోన్ వాడకం ఎక్కువ అవడంవల్ల నిద్ర తగ్గిపోయింది. దానివల్ల ఆకలి మీద ధ్యాస తగ్గింది. ఆ రెండూ తప్పడంవల్ల ఇప్పుడీ అనారోగ్యం వచ్చింది. ఇప్పటికి పర్వాలేదు, ఇకముందైనా వాటికి దూరంగా ఉంటే



మంచిది.. లేకపోతే ఎప్పటికైనా ప్రమాదమే..." చెప్పి వెళ్ళిపోయాడు డాక్టర్. రాఘవ భారంగా కళ్ళు తెరిచి ఆగి ఆగి చెప్పసాగాడు. "సార్...నిన్న మీరు వెళ్ళిన తర్వాత మెట్లమీద నుండి రూములోకి వెళ్దామని పైకి లేచాను. ఒక్కసారిగా కళ్లు బైర్లు కమ్మినట్లుగా అనిపించింది. ఒళ్లంతా నీరసంగా ఉంది. మా ఫ్రెండ్స్‌ని పిలిచాను. ఒక్కడు కూడా అందుబాటులో లేదు, ఎవరి పనుల్లో వాళ్ళున్నారు. చివరికి ఇదివరకు బైబిలు స్టడీ కొచ్చిన వీళ్ళే నన్నిక్కడికి తీసుకొచ్చారు. సమయానికి వీళ్ళు రాకపోయినా, నాకేమైనా అయినా నా తల్లిదండ్రుల పరిస్థితి ఎలా ఉండేదో ఆలోచిస్తేనే భయమేస్తుంది సార్..." అన్నాడు. కన్నీళ్ళు చెంపల్ని తాకుతున్నాయి.

పశ్చాత్తాపం మొదలైంది. పరివర్తన ప్రారంభమైంది. తన లోపాలు తాను గుర్తించాడంటే దేవుని కార్యం మొదలైనట్లే... దేవునికి దగ్గరవుతున్నట్లే! నిరీక్షణ్ ఎంతో సంతోషపడ్డాడు. అప్యాయంగా రాఘవను సమీపించి "రాఘవా... ఈ సృష్టంతా దేవుడే చేశాడు. మంచినీ చెడునూ గుర్తించమనే వివేకాన్ని మాత్రం మనిషికి ఇచ్చాడు. మనకు లోకమంతా కావాలి. కానీ అందులో మనకు అవసరమైన వాటిని గుర్తించాలి. అనారోగ్యాన్నిచ్చే వాటికి దూరంగా ఉండాలి. నువ్వు డిటికి వెళ్ళావు. దేవుని గురించి ఎంతో నేర్చుకొన్నావు. నువ్వు నేర్చుకొన్న విషయాలు నలుగురికీ చెప్పాలేగానీ వాళ్ళతో పాటే లోకంలో కలిసిపోకూడదు. నిజమైన క్రీస్తు శిష్యునిగా ఇకనైనా లోకాన్ని విడిచిపెట్టి దేవుని కోసం దీపంలా వెలుగు. నలుగురు మిత్రుల్ని ఆ వెలుగులోకి నడిపించు. దీపాన్నెప్పుడూ మంచం కిందనో కుంచం కిందనో పెట్టకూడదు, నలుగురికీ వెలుగిచ్చే ప్రదేశంలో ఉంచాలి..." అన్నాడు నిరీక్షణ్. రాఘవ కళ్లు ఆనందంతో మెరిశాయి. పూర్ణమనస్సుతో క్రీస్తును వెంబడిస్తూ లోకానికి ఉప్పులా వెలుగులా ఉండేలా సహాయం చేయమని మనసులోనే ప్రార్థించుకొన్నాడు.

**– డా. జడా సుబ్బారావు**, నూజివీడు

## కోశాధికారి లేఖ

# ఇవ్వడంలో తప్పుడు ప్రేరేపణలు

ప్రభువునందు ప్రియమైన యుఇయస్ఐ-ఏపిలోని కోశాధికారులందరికి, సభ్యులకు, ప్రార్థనా భాగస్వాములకు పరిశుద్ధులును, క్రీస్తు యేసునందు విశ్వాసులైనవారికి శుభములు అని తెలుపుతూ రాయునది.

నీవు, నేను ఎందుకు ఇవ్వాలి? అంటే ఇది దేవుని ఆజ్ఞ. దేవుడు నీ, నా కొరకు, నిన్ను, నన్ను రక్షించుట కొరకు తన ప్రాణాన్ని ఫణంగా మొదట ఆయన ఇచ్చారు కాబట్టి మనం ఇవ్వాలి. ఇచ్చి ఆయనను సంతోషపెట్టాలి. ఇవ్వడంలో ప్రేరణే కీలకమైనది.

**ఇవ్వడంలో తప్పుడు ప్రేరేపణలు:**

1. **గర్వం:** మనం ఇచ్చినప్పుడు ఇతర మనుష్యుల వలన ఘనత పొందాలని ఇవ్వడం తప్పుడు కారణంతో ఇచ్చినట్లు.ఇవ్వడం దేవుని రాజ్యం కొరకు రహస్యంగా జరగాలి (మత్తయి 6:1-4). వీటిలో దాతల పేర్లు నిర్మాణాలమీద రాయడం, శిలాఫలకాలు పెట్టడం ఈ నియమాన్ని అతిక్రమిస్తుంది.
2. **అపరాధభావన:** మనం ఎక్కువ కలిగివున్నామన్న అపరాధభావనను బట్టి ఇవ్వకూడదు. ఒకవేళ మనకు అప్పగించిన వాటిమీద మంచి గృహనిర్వాహకులుగా లేకపోతే మనం పశ్చాత్తాపంతో సరిచేసుకొని మంచి ప్రేరణతో ఇవ్వాలి.
3. **దురాశ:** లూకా 6:38 ఇయ్యుడి, అప్పుడు మీకియ్యబడును అనే వాక్యాన్ని తప్పుగా వాడి ప్రజలను ప్రేరేపిస్తారు. ఎక్కువగా ఇస్తే ఎక్కువగా వస్తాయని. యేసు ప్రభువు మనం ఇస్తే, దేవుడు మనకు ఎక్కువ ఇస్తారని వాగ్దానం ఇవ్వడం లేదు. ఆయన ఇక్కడ ఒక నియమాన్ని తెలియజేస్తున్నారు. మనం ఇచ్చే వారం అయితే ఇతరులు మన పట్ల ఉదారంగా ఉంటారు.
4. **ఒత్తిడి:** క్రైస్తవ ఫండ్ రైజర్స్ ఎక్కువ ఒత్తిడిని పెంచే చమత్కారాలకు స్పందించుట తప్పుడు ప్రేరేపణలతో ఇవ్వడమే. మనం ఇవ్వాల్సింది బలవంతంగా కాదు (2 కొరింథీ 9:7).
5. **జిమ్మిక్కులు:** ఇది ఒత్తిడి దురాశకు సంబంధించినది. ప్రజలు ఎక్కువగా ఇవ్వాలని అన్నిరకాల జిమ్మిక్కులు వాడతారు. వాటిలో కొన్ని నీవు పంపే విరాళానికి నా కొత్తపుస్తకం ఇస్తానని, మీ ప్రియమైనవారిపేర్లు మా ప్రత్యేక పుస్తకములో చేర్చబడతాయని, మీరు ఇస్తే పెద్దఇల్లు, పెద్ద కారు పొందుతారనో, ఫలాన సహోదరుడు/సహోదరి ప్రార్థన చేసిన చేతి రుమాలు పంపిస్తామని, మా దగ్గర మీకు పర్మినెంట్ మెంబర్‌షిప్ కార్డు వస్తుందనో, ఫలాన వ్యక్తి వచ్చి మీ కుటుంబ విందులో పాల్గొంటాడని, లేక మీతో కలసి ఫొటో దిగుతాడని..ఇవి ఖచ్చితంగా తప్పుడు ప్రేరేపణలతో ఇవ్వడం కోసం వాడే జిమ్మిక్కులే.

కావున తప్పుడు ప్రేరేపణలతో ఇచ్చేవారంగా మనం ఉండక మంచి ప్రేరేపణలతో దేవుని రాజ్యాన్ని విద్యార్థుల మధ్య విస్తరింపజేయడానికి మనం ఉత్సాహంగా ఇద్దాం. ప్రభువును ప్రేమిద్దాం.

**స్తుతించండి**

1. మన స్టాఫ్‌కు 100% శాలరీ, అలవెన్స్‌లు ఇవ్వడానికి ప్రభువు చూపిన కృపను బట్టి

**ప్రార్థించండి**

1. యుఇయస్ఐ-ఏపి ఏసియం-2022 తర్వాత పెరిగిన 16.53% బడ్జెట్‌కు అనుగుణంగా 47 ఇజియఫ్‌లు కాంట్రిబ్యూషన్స్ పెంచి పంపుతున్నాయి, మిగిలిన ఇజియఫ్‌లు కూడా స్పందించేటట్లు
2. స్టైరెట్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కోసం 8 లక్షలు, చాందపిళ్ళ అడ్మినిస్ట్రేటివ్ బ్లాక్ రిపేర్ వర్క్స్ కొరకు 5 లక్షలు అవసరం
3. యుఇయస్ఐ నేషనల్ వేతన సవరణలకు అనుగుణంగా మన స్టాఫ్‌కు కూడా వేతనాలు పెంచడానికి ఏసియం 2022 నిర్ణయించారు. దీని అవసరత ప్రతి నెల రూ. 70,000/- పెరుగుతుంది.
4. స్టాఫ్‌కు ఐదు ల్యాప్‌టాప్‌లు సబ్సిడీలో ఇవ్వడానికి అవసరమైన 1,20,000/- కొరకు

ఇట్లు
క్రీస్తులో మీ సహోదరుడు
యస్.ఆర్.డి. కిషోర్ కుమార్

**AP MONTHLY REQUIREMENT – Rs. 11,41,000/- (16.53% Hike W.R.T present income)**
**MONTHLY REQUIREMENT FOR UESI NATIONAL – Rs. 4,32,000/-**
**TOTAL - 15,73,000**


## DECEMBER 2022

| Receipts | | Payments | |
|---|---|---|---|
| Opening Balance | 859.00 | Field Staff Salaries | 4,94,703.00 |
| General Fund | 13,56,802.00 | Field Staff HRA, CA, MA & TA | 2,86,269.00 |
| Staff Support | 36,000.00 | Office Staff Salaries | 1,55,149.00 |
| Rajasthan | 31,000.00 | UESI | 3,50,000.00 |
| | | Rajasthan | 30,000.00 |
| | | Jammu & Kashmir | 15,000.00 |
| | | APEGF | 3,000.00 |
| | | Girls Depatment | 3,500.00 |
| | | To Gratuity | 50,000.00 |
| | | Office Expenditure | 36,477.00 |
| | | Closing Balance | 563.00 |
| **Total** | **14,24,661.00** | | **14,24,661.00** |

Registered with the Registrar of News Papers of India **RNI No. 52991/94**
Postal Registration No. : **GTR/59/2021-2023**

**Date of Printing: 25-01-2022**
**Date and place of posting: 27th and 28th of every month at GUNTUR RMS**

Printed at Bhashyam Publishers, Amaravathi Road, Guntur 522 007. by Mr. P. Basavaiah
Edited by Mr. B.J. Lazarus and published by UESI-AP, Nambur - 522 508



# శిష్యులమే కానీ...

అద్దంలో మన ముఖాన్ని చూసుకొని
అప్పుడే మర్చిపోయినట్టుగా
ఎప్పుడూ వాక్యాన్ని చదువుతూనే ఉంటాం
వివరంగా వింటూనే ఉంటాం
మరెందుకో పరిశుద్ధతను
అప్పుడే మరిచిపోతున్నాం
మరి అద్దంలాగా ఆయనను
ఎలా ప్రతిబింబించగలం?
నిజమైన శిష్యులంగా ఎలా జీవించగలం??

సంవత్సరానికో నిర్ణయం తీసుకోవడమే కానీ
తీరుగా పాటించడం చేతకాదు
ఏడాదికో వాగ్దానం అందుకోవడమే కానీ
విశ్వాసంతో స్వతంత్రించుకోవడానికి మనసెందుకో
ఒప్పుకోదు
మరి అనుదిన జీవితంలో
యేసుని ఎలా చూపగలం ?
ఆయన బిడ్డలమని లోకానికి ఎలా చాటగలం??

ఎండమావిలో నీళ్ళ కోసం వెదికినట్లు
మనలో శిష్యత్వ లక్షణాలు వెదకాల్సివస్తుంది
ఇసుక నుంచైనా తైలం తీయవచ్చు కానీ
ఆత్మీయులమనుకుంటున్న మనలో
ఆత్మీయత ఇసుమంతైనా కనిపించడం లేదు
ఇనుమునైనా కరిగించగలం కానీ
విధేయులమని చెప్పుకుంటున్న మనలో
వినయం భూతద్దంలో కూడా కనబడదు!

మనస్సాక్షి గద్దింపులకు
మనమే లోబడకుండా
ఎవరిని హెచ్చరించగలం?
మనసంతా స్వార్థంతో...
మనిషంతా గర్వంతో...
ఎవరిని ప్రేమించగలం?
ఎవరికి వారే గొప్ప...
ఎవరిని హెచ్చించగలం??

గగనం సృష్టికర్తను ఘనపరిచింది
ఆకాశం నుంచి ఆహారం కురిపించింది
నేల సర్వాధికారి మాట విన్నది
తలవంచి ఫలాలనిస్తుంది
సాగరం సర్వోన్నతునికి సాగిలపడింది
సగానికి చీలి దారినిచ్చింది
ఆయన అనుచరులంగా
సిలువవేయబడిన జీవితాన్ని జీవించవద్దా!
నిజమైన శిష్యులమని నిరూపించుకోవద్దా!

– గొంగటి మేరి జాయ్, ఆదోని